ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో

మీకు నిజం రాసే ధైర్యం ఉందా?

అందుకు వార్త సంధ్య మీ వేదిక!

రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.

ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

vaarthasandhya@gmail.com



RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు





SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01 సంచిక : 196  శనివారం 04 - 07 - 2026  ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్  పేజీలు : 08  వెల : 6/-




Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 196  Saturday 04 - 07 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-


### బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా

# కేసీఆర్‌కు భట్టి సవాల్!

- హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు
- రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా
- కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్
- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయన్న భట్టి
- అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
- సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 03 :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు.వివిధ మార్గాల- మిగతా 2 లో

### మంత్రి చెప్పింది ఒకటి..

# సీఎం చెప్పింది మరొకటి




- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు
- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి
- ప్రభుత్వ పెద్దల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపణ

### తెలంగాణ

# ప్రజలకు అలర్ట్



- 7 రోజుల పాటు దంచికొట్టనున్న వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రాల బులెటిన్
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు
- తెలంగాణలోని ఉత్తర జిల్లాలకు భారీ నుండి అతి భారీ వర్ష సూచన

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 03 :** నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో రాబోయే వారం రోజుల పాటు వాతావరణం పూర్తిగా మారిపోనుంది. తెలంగాణలో జులై 4 నుండి జులై 9 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ - మిగతా 2 లో

# భారత్ రక్షణ మరింత పటిష్ఠం


- రూ.52 వేల కోట్లతో ఆయుధాల కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్
- రూ.52 వేల కోట్ల కొనుగోళ్లకు ఆమోదం
- రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన డీఏసీ సమావేశం
- సైన్యానికి యాంటీ డ్రోన్ వ్యవస్థలు
- నౌకాదళానికి కొత్త డ్రోన్లు, మైన్లు
- వాయుసేనకు అధునాతన నిఘా వ్యవస్థ

**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 03 :** భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశంలో సుమారు రూ.52 వేల కోట్ల విలువైన రక్షణ కొనుగోళ్లకు ఆమోదం లభించింది.భారత సైన్యం కోసం యాంటీ డ్రోన్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ 'ఆకాశ్ తరంగ్', మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్లు, మీడియం రేంజ్ 'సర్ఫేస్ టు ఎయిర్' మిసైల్ వ్యవస్థ, వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ - మిగతా 2 లో



### సింధు జలాల ఒప్పందంపై

# వెనక్కి తగ్గేది లేదు



- పాకిస్థాన్‌కు భారత్ స్పష్టం
- ఉగ్రవాదానికి మద్దతు ఆపే వరకు ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని వెల్లడి
- 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ నిర్ణయం
- ఈ ఒప్పందంపై పాకిస్థాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చిన భారత విదేశాంగ శాఖ

**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 03 :** సింధు జలాల ఒప్పందంపై భారత్ తన వైఖరిని మరోసారి సుస్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ విశ్వసనీయంగా, శాశ్వతంగా అడ్డుకట్ట వేసే వరకు 1960 నాటి ఈ ఒప్పందం నిలిపివేత దిశగానే ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంలో పాకిస్థాన్ చేస్తున్న విమర్శలను, హెచ్చరికలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా తోసిపుచ్చింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ అంతర్జాతీయ - మిగతా 2 లో

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా.. మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి
- పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్




### విజయవాడలో గవర్నర్‌తో

# పవన్ కల్యాణ్ భేటీ

- వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ
- సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, జులై 03 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. - మిగతా 2 లో

### ఏపీ హైకోర్టుకు ముగ్గురు

# అదనపు న్యాయమూర్తులు



- కేంద్రం ఉత్తర్వులు
- నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం
- మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం
- కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు

**వార్త సంధ్య, అమరావతి, జులై 03 :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు.అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు - మిగతా 2 లో



## అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది

- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి
- ఏపీ ఇప్పటికే లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందన్న సజ్జల
- అమరావతి కోసం మరో రూ. 2 లక్షల కోట్ల భారం మోపితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్న
- ప్రభుత్వాన్ని వైసీపీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్న సజ్జల

**వార్త సంధ్య, అమరావతి, జులై 03 :** రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని... ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

# స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సున్నపురాళ్లపల్లె సమీపంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్ పనులకు సీఎం శ్రీకారం
- స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం మొదలైందన్న చంద్రబాబు
- రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతామని వ్యాఖ్య
- గత ప్రభుత్వం ఇదే స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు మోసపూరితంగా శంకుస్థాపన చేసింది
- రూ.16,350 కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్.. 2,700 మందికి ఉద్యోగాలు
- బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో దోపిడీ జరిగిందని, కియా అభివృద్ధికి నిదర్శనమని వ్యాఖ్య
- ఏపీని ఉక్కు రాష్ట్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ




**వార్త సంధ్య, అమరావతి, జులై 03 :** రాయలసీమ అంటే కరవు నేల కాదని, జలకళ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమ అంటే పచ్చదనం, పరిశ్రమలని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం మొదలైందన్నారు. ఈ ప్రాంత బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతామని పేర్కొన్నారు. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నామని వివరించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపు రాళ్లపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.అంతకుముందు చంద్రబాబు రూ.16,350 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఉక్కు కర్మాగార పనులను ప్రారంభించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారిందని చంద్రబాబు తెలిపారు. రాయలసీమ స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించుకున్నామని వివరించారు. రాళ్ల సీమ కాదు, రతనాల సీమ అని చేసి చూపిస్తున్నామని రాబోయే రోజుల్లో రాయలసీమకు అన్నీ మంచి రోజులే అని చంద్రబాబు స్పష్టం చేశారు."రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైంది. - మిగతా 2 లో

# సంపాదకీయం

## కొత్త సౌభ్రాతృత్వం



'మనిషి సృష్టించిన సమస్యలతో ఇప్పటికే బాగా ఇబ్బందులలో ఉన్న పేద దేశాలు ఇప్పుడొక కొత్త ప్రాకృతిక వినాశనాన్ని ఎదుర్కోబోతున్నాయి. వాతావరణ మార్పే ఆ విపత్తు' అని ఐదు దశాబ్దాల క్రితం ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధిసభ ప్రత్యేక సమావేశంలో అమెరికా రాజనీతిజ్ఞుడు ఒకరు హెచ్చరించారు. జాగృత వాణి. అయితే ఆ ముప్పు ముంగిట ఉన్నది పేద దేశాలేనా? కాదని కాలం తరచు పదే పదే స్పష్టం చేస్తూనే ఉన్నది. గత కొద్ది రోజులుగా యూరోపియన్ దేశాలలో పౌర జీవనాన్ని మున్నెన్నడూ లేని రీతిలో అస్తవ్యస్తం చేస్తున్న భీకర వడగాలులే అందుకొక తాజా నిదర్శనం.విపరీత స్థాయిలో మండుతున్న ఎండా కాలాన్ని యూరోపియన్లు చవి చూస్తున్నారు. గతంలో మూడు శతాబ్దాలకొక పర్యాయం మాత్రమే వీచిన అటువంటి చండ్రగాడ్పులు ఇప్పుడు ఒక దశాబ్ది కాలంలోనే ఒకటి కంటే ఎక్కువసార్లు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెప్పుతున్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల రికార్డులు బద్దలు గొడుతుండడంతో ఈ వైపరీత్యం కొత్త సాధారణ పరిస్థితి కాబోదు కదా అని సామాన్యులు ఆందోళన చెందుతుంటే యూరోప్ వాతావరణం మౌలికంగా మారిపోతుందా అని వైజ్ఞానికులు తర్కిస్తున్నారు. సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో పెరిగినట్టు వివిధ అధ్యయనాలు ధ్రువీకరించిన కొద్ది రోజులకే యూరోప్‌లో సూర్యుడి భగ భగలు తీవ్రమయ్యాయి. వందలాది నగరాలలో రోజువారీ ఉష్ణోగ్రతల కనీస సగటు 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిపోవడం చాలామంది యూరోపియన్లకు కొత్త అనుభవం. ధనికులు--పేదలు, పిన్నలు--పెద్దలు అందరూ అత్యుగ్ర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రయాసపడుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఎడతెగని ఘర్షణలతో నెలకొన్న ఇంధన సంక్షోభంతో సతమతమవుతున్న యూరోపియన్లకు ఈ వడగాడ్పులు ప్రాణాంతకమయ్యాయి. వివిధ యూరోపియన్ దేశాలలో ఎండల తీవ్రతకు చనిపోయిన వారి సంఖ్య ఇప్పటికే నాలుగు అంకెల్లో ఉన్నది. ఇంధన, వాతావరణ సంక్షోభాలు రెండూ శిలాజ ఇంధనాల వినియోగంతో ముడివడివున్నవి కావడం గమనార్హం. కాలుష్య కారక వాయువులను ఉద్గారించని హరిత ఇంధనాల వాడకానికి త్వరితగతిన మారడమే ఆ రెండు ఉత్పాతాలకు ఒక సహేతుకమైన పరిష్కారం. యూరోపియన్ ప్రభుత్వాలు, ప్రజలు ఈ విషయమై ఇప్పటికైనా చిత్తశుద్ధితో శ్రద్ధాసక్తులు చూపని పక్షంలో సుదీర్ఘకాలం పాటు ఏటా ఉగ్రవేసవినే చవిచూడవలసివస్తుంది, సందేహం లేదు.వాతావణ మార్పు, భూతాపం ప్రతికూల ప్రభావాలను అరికట్టేందుకు యూరోపియన్లు ఇంతవరకు ఒక దృఢ సంకల్పంతో పూర్తి స్థాయిలో పూనుకోలేదనే చెప్పాలి. కనుకనే వారు శిలాజ ఇంధనాలను యథేచ్ఛగా వాడుతూనే ఉన్నారు. వాటి వినియోగం నిలిచిపోయినప్పుడు లేదా గణనీయంగా తగ్గిపోయినప్పుడు మాత్రమే ఉగ్ర వేసవికాలాలు పునరావృతం కావు.యూరోపియన్లకు వాటిల్లిన వేసవి క్లేశాలపై సానుభూతి చూపడమే కాకుండా, వాటిని అధిగమించే మార్గాలనూ అన్వేషించడం అవసరం. ప్రకృతిపై సార్వభౌమత్వం సాధించాలని మానవుడు ప్రయత్నించడం ఎంత పురాతనమో మనిషిపై ప్రకృతి పగపట్టడం కూడా అంతే ప్రాచీన వ్యవహారం. భౌతిక జగత్తుపై తనకు ఆధిపత్యం ఉందనే భ్రమను మానవుడు విడనాడనంతవరకు మనిషి పర్యావరణ సంక్షోభాల పాలవుతూనే ఉంటాడు. ప్రకృతితో సామరస్యం ముఖ్యం. దాన్ని సాధించడమెలా? వాతావరణ మార్పును పూర్తిగా నిరోధించడమే. అందుకు సామాజిక వ్యవస్థలు, జీవావరణం పట్ల ఒక కొత్త సౌభ్రాతృత్వ వైఖరితో వ్యవహరించాలి. మానవాళిని స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వం వైపు నడిపించిన యూరోప్ నుంచే ఆ వెలుగుబాట ప్రారంభమవగలదని ఆశిద్దాం.

# స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం

**మొదటిపేజీ తరువాయి -** రాయలసీమ అంటే హార్టికల్చర్ హబ్‌గా మారిపోయింది. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. 2019 డిసెంబర్‌లో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా? చిన్న భవనమైనా కట్టారా?రాయలసీమలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం. 1100 ఎకరాలు భూమి ఇచ్చాం. రూ.16,350 కోట్లతో ఫేజ్-1, 2 ఉక్కు కర్మాగారానికి నాంది పలికాం. మొదటి దశ రూ.4,500 కోట్లు, రెండో దశ రూ.11,850 కోట్లు. సోలార్ ఎనర్జీకి రూ.20,350 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారు. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుంది.ఇంకా పెద్దఎత్తున పెట్టుబడులకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు.'జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ప్లాంట్‌తో ఏపీ ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు, రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోంది. ఉక్కు రాయలసీమగా మారబోతోంది. నాలుగు దశాబ్దాల క్రితం మొదలైన విశాఖ ఉక్కు రాష్ట్రానికి తలమానికంగా ఉంది. సంక్షోభ సమయంలో ప్రధానితో మాట్లాడి రూ.11.440 కోట్లు ఆర్థికసాయం తెచ్చాం. లాభాల బాటలో విశాఖ ఉక్కు ముందుకెళ్లే పరిస్థితి తీసుకొచ్చామని' చంద్రబాబు పేర్కొన్నారు."దేశంలోనే తొలిసారిగా గ్రీన్ ఎనర్జీతో గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఇది. జేఎస్‌డబ్ల్యూ సంస్థకు కావాల్సిన భూమి ఇచ్చాం. రాయలసీమ చరిత్ర మార్చేలా ఈ ప్లాంట్ ఉంటుంది. గతంలో స్టీల్‌ప్లాంట్ అని భ్రమ కల్పించారు, ఎయిర్‌పోర్టు అన్నారు. ఓబులాపురం గనుల పేరు చెప్పి దోపిడీ చేసి ఐరన్ ఓర్‌ను విదేశాలకు పంపారు. దేశంలో ఉండే ఖనిజ సంపద విదేశాలకు ఎవరు తరలించారో అందరికీ తెలుసు. రాయలసీమ ఖనిజ సంపదతో రాయలసీమలోనే సంపద సృష్టిస్తానని హామీ ఇస్తున్నా. రాయలసీమలోనే స్టీల్ తయారుచేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.రాష్ట్రంలో 11 లక్షల 50 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. పెట్టుబడుల వల్ల 9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వలసలు పోయే పనే లేదని, రాయలసీమలోనే ఉద్యోగాలొస్తాయని వివరించారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో కడపకు ఏం చేసిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాబోయే 24 నెలల్లో పనులు పూర్తిచేసే బాధ్యత తమదన్నారు. 2028 జులై 3న మళ్లీ వస్తానని, ప్లాంట్ ప్రారంభిస్తానని చంద్రబాబు స్పష్టంచేశారు."ఆగస్టు 15 లోగా లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు మదనపల్లెలో శంకుస్థాపన చేస్తాం. రూ.40,000ల కోట్లు ప్రభుత్వం భరిస్తే, రూ.60,000ల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి. హార్టికల్చర్‌లో రాయలసీమను ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం. రాయలసీమను పర్యాటక కేంద్రంగా తయారుచేస్తాంమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు. 'రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించాం. నేరాలు చేసే రాజకీయ నాయకులు ఉన్నారు, అప్రమత్తంగా ఉండాలి. బాబాయిని చంపేసి ఆ నేరం నాపై మోపాలని కుట్ర పన్నారు. విధ్వంసమే అజెండాగా ముందుకెళ్లి రాష్ట్రాన్ని నాశనం చేశారు. మొన్న మావిగన్, నిన్న విజయవాడ, రేపు ఏమంటారో చూద్దాం? మతిస్థిమితం లేని వ్యక్తులతో రాజకీయం చేయడం నా చరిత్రలో చూడలేదు. మాటపై నిలబడ్డాం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముందుకెళ్తున్నాం. ఎవరెన్ని కుట్రలు పన్నినా మన రాజధాని అమరావతే. రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితి తీసుకొస్తామని' చంద్రబాబు వివరించారు.ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి చెబుతున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. గంజాయిపై ఉక్కుపాదం మోపి పూర్తిగా అరికట్టామన్నారు. గంజాయి సేవించిన వారిని వదిలిపెట్టలేదని చెప్పారు. గంజాయి బ్యాచ్‌ను వెనకేసుకొచ్చేవారిని ఏమనాలని ప్రశ్నించారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే పెట్టుబడులు వస్తాయని చంద్రబాబు తెలిపారు.ఒకప్పుడు రాయలసీమ నుంచి వలసలు వెళ్లేవారని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమలో అభివృద్ధి పరిగెడుతోందన్నారు. చంద్రబాబు విజన్, లోకేశ్ ఆలోచనలు, పవన్ నేతృత్వంలో అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా రాయలసీమ మారబోతోందని వివరించారు. అభివృద్ధి నినాదాలు కాదని, నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని శ్రీనివాసవర్మ వెల్లడించారు.గత పాలకులు రాయలసీమ అభివృద్ధిని పట్టించుకోలేదని శ్రీనివాసవర్మ ఆరోపించారు. వైఎస్ కుటుంబానికి రాయలసీమ అభివృద్ధి అంటే ఇష్టం ఉండదన్నారు. దిగ్గజ సంస్థ జేఎస్‌డబ్ల్యూ కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ నెలకొల్పడం అదృష్టమని తెలిపారు. రాయలసీమలో దిగ్గజ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ సీఎండీ సజ్జన్ సిందాల్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది

**మొదటిపేజీ తరువాయి -** ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు.రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా... ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని... దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.47 వేల కోట్ల వరకు అప్పులు తీసుకువచ్చిందని సజ్జల వెల్లడించారు. అంత భారీ నిధులను రాజధాని హంగులకే తగలేయకుండా... మచిలీపట్నం పోర్టు, కొత్త మెడికల్ కళాశాలలు, హంద్రీ-నీవా సుజల స్రవంతి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరేదని అభిప్రాయపడ్డారు.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందని... ఇలాంటి తరుణంలో రాజధాని కోసం మరో రూ.2 లక్షల కోట్ల అదనపు భారం మోపితే సామాన్యుడి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు ఓటు వేసిన బలమైన పార్టీగా వైసీపీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూనే ఉంటుందని చెప్పారు.


## సింధు జలాల ఒప్పందంపై వెనక్కి తగ్గేది లేదు



**మొదటిపేజీ తరువాయి -** సదస్సు నిర్వహించి, భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఒప్పందం ఇప్పటికీ అమలులోనే ఉందని, నీటిని ఆయుధంగా మార్చవద్దంటూ పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ సహా ఇతర మంత్రులు చేసిన హెచ్చరికలను ఆయన తిప్పికొట్టారు. తన అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పాకిస్థాన్ ఇలాంటి నిరాధార వ్యాఖ్యలు చేస్తోందని ఆయన విమర్శించారు.2025 ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటన అనంతరం, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి నిరసనగా భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేసింది. ఒప్పందానికి ప్రతిపాదిక అయిన స్నేహపూర్వక వాతావరణాన్ని, సద్భావన సూత్రాలను పాకిస్థాన్ నిరంతరం ఉల్లంఘిస్తోందని భారత్ ఆరోపిస్తోంది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన రావి, బియాస్, సట్లేజ్‌లపై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు ప్రధాన హక్కులు లభించాయి. ప్రస్తుతం నదీ జలాల ప్రవాహంలో ఎలాంటి మార్పులు లేనప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ వివాదంపై అంతర్జాతీయ స్థాయిలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ హెచ్చరిస్తోంది.

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా.. కేసీఆర్‌కు భట్టి సవాల్!

**మొదటిపేజీ తరువాయి -** ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసత్యలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు. 10 వడ్డీకి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పులు తెచ్చారన్నారు. వడ్డీల భారాన్ని తగ్గించేందుకు తాము అనేక చర్యలు చేపట్టినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామన్నారు. రోడ్డుపై నిలబడి అడ్డగోలుగా రోజూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్‌రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్‌రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు.





నిశ్శబ్దంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కావాలని పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఆ పార్టీ వారు అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కేసీఆర్ మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు."హాస్టల్ పిల్లలకు క్వాలిటీ వస్తువులు ఇవ్వాలనే టెండర్లు పిలిచాం. రూ.1,142 కోట్లకు టెండర్లు పిలిస్తే రూ.2 వేల కోట్ల అవినీతి అంటున్నారు. మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా. పదేళ్లపాటు దోపిడీ చేసింది ఎవరు కేసీఆర్ కాదా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేసీఆరే బయటకు వచ్చి మాట్లాడాలి. బాధ్యతగా పనిచేస్తున్న మంత్రులపై అభాండాలు సరికాదు. ఎవరి స్థాయి ఏమిటో వారు పోషించే పాత్రతో తెలుస్తుంది. మీరు చేసిన అప్పులు తీర్చేది కాళేశ్వరం కార్పొరేషనా, ప్రభుత్వమా. కీలక విషయాలపై కేసీఆర్ మాట్లాడాలి.. కేటీఆర్, హరీశ్‌రావు కాదు. మీరు చేసిన అప్పులు రాష్ట్రానికి పెనుభారంగా మారాయన్న ఉపముఖ్యమంత్రిభట్టి విక్రమార్క.సింగరేణి బొగ్గు ఆరోపణలపై విచారణకు ఆదేశం : సింగరేణికి నష్టం కలిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కోల్‌బ్లాక్‌లు తెచ్చుకునేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామన్న ఆయన సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. సింగరేణిపై కావాలనే బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణికి కొత్త బ్లాక్‌లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్‌రావులేనని భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో బొగ్గుమాయమైందని కేటీఆర్, హరీశ్‌రావులు చేసిన ఆరోపణలపై స్పందించిన భట్టి విక్రమార్క వాటిపై విచారించాలని ఆ సంస్థ విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. సింగరేణికి నష్టం కలిగిస్తే నష్టపోతేది రాష్ట్రప్రజలేనని ఆయన తెలిపారు.

## తెలంగాణ ప్రజలకు అలర్ట్



**మొదటిపేజీ తరువాయి -** మేరకు హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు ఉమ్మడిగా వాతావరణ బులెటిన్‌ను విడుదల చేశాయి. రాబోయే 7 రోజుల పాటు రెండు రాష్ట్రాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశాయి.

**తెలంగాణ వాతావరణ సూచన (జులై 3 - 9):**


తెలంగాణ వ్యాప్తంగా జులై 9 వరకు విడతల వారీగా వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండనుంది.

జులై 4 - 5: ఉత్తర జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

జులై 5 - 9: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నిరంతరాయంగా కురుస్తూనే ఉంటాయి.వర్షంతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. అయితే, రాబోయే ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలలో ఎలాంటి పెద్ద మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.తీవ్రమైన ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల కారణంగా చేతికి వచ్చే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. బలహీనంగా ఉన్న తాత్కాలిక నిర్మాణాలు, హోర్డింగులు కూలిపోయే అవకాశం ఉన్నందున ప్రయాణికులు, బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులు పొలం పనుల సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

## లెక్కలు తప్పితే రాజీనామా చేస్తా.. మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు."ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు.అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు.తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.



## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**మొదటిపేజీ తరువాయి -** చేపట్టినట్లు కేంద్రం తెలిపింది.ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది.హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

## భారత్ రక్షణ మరింత పటిష్ఠం

**మొదటిపేజీ తరువాయి -** డిఫెన్స్ వ్యవస్థలు, ట్యాంకులకు యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్, జెట్ ఆధారిత కమికాజే డ్రోన్ వ్యవస్థ కొనుగోళ్లకు ఆమోదం లభించింది.నౌకాదళం కోసం మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్స్, నౌకల నుంచి ప్రయోగించే మానవరహిత వైమానిక వ్యవస్థలకు, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థల పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీంతో సముద్ర నిఘా, శత్రు కదలికల పర్యవేక్షణ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం తెలిపింది.వాయుసేన కోసం 'ఫిక్స్‌డ్ వింగ్ హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్' కొనుగోలుకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. దీని ద్వారా దీర్ఘకాలిక నిఘా, ఇంటెలిజెన్స్, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సామర్థ్యాలు మరింత బలోపేతం కానున్నాయి. ఈ కొనుగోళ్లతో మూడు దళాల యుద్ధ సన్నద్ధత, సరిహద్దుల భద్రత, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలు మరింత పెరుగుతాయని రక్షణ శాఖ వెల్లడించింది.

## విజయవాడలో గవర్నర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

**మొదటిపేజీ తరువాయి -** సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకు ముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

## మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు.ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మంథని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ - డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమం ప్రారంభం



**మంథని, జూలై 3(వార్త సంధ్య ) :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో "అన్న--అక్క మెంటార్‌షిప్" ఆధ్వర్యంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మరియు డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం మంథని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చాట్ల పరిషయ్య మాట్లాడుతూ, భవిష్యత్తు పూర్తిగా ఏఐ ఆధారిత సాంకేతికత వైపు సాగుతోందని, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్విని యోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళా శాల నోడల్ ఫ్యాకల్టీ సభ్యుడు కర్నాటి కృష్ణ మాట్లాడుతూ, "అన్న--అక్క మెంటార్‌షిప్" కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఇంటర్న్‌లుగా ప్రభుత్వ పాఠశాలలకు కేటా యించి, 15 రోజుల పాటు రోజుకు రెండు గంటల చొప్పున మొత్తం 30 గంటల శిక్షణ అందిస్తారని తెలి పారు. ఈ శిక్షణలో ఏఐ, డిజిటల్ లెర్నింగ్, కోడింగ్, పైతాన్, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలను బోధించి విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అసి స్టెంట్ ప్రొఫెసర్ సతీష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కొమురయ్య, ఉపాధ్యాయులు, ఇంటర్న్ విద్యార్థులు శరత్, భవాని సాత్విక్, సాయి, హరీష్తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సెంట్రల్ డివైడర్ ను పరిశీలించిన మేయర్ మూడ్ గణేష్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య) :** పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో ఉన్న సెంట్రల్ డివైడర్‌ను శుక్రవారం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సెంట్రల్ డివైడర్‌ను పచ్చదనంతో అభివృద్ధి చేయడంతో పాటు పరిశుభ్రతను నిరంతరం కాపాడాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. డివైడర్ పరిసరాల్లో ఎలాంటి చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాల్వంచ పట్టణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సుందరంగా, ప్రజలకు ఆదర్శంగా ఉండేలా మున్సిపల్ శాఖలన్నీ సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని మేయర్ మూడ్ గణేష్ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, మున్సిపల్ జవాన్లు పాల్గొన్నారు.

## మాలల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

### మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 3.:** మాలలకు విద్య ఉద్యోగ అవకాశాలు దక్కకుండా రోస్టర్ పాయింట్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం తక్షణమే రోస్టర్ పాయింట్లను సవరించాలని లేదంటే అది మాలల రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాయడమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య పేర్కొన్నారు శుక్రవారం నాడు హైదరగూడ లోని యన్ ఎస్ ఎస్ లో జరిగిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో 5 శాతం కేటాయించిన గ్రూప్ 3 లోని మాల మాల అనుబంధ కులాలకు కొన్ని నోటిఫికేషన్ లలో సున్నా పోస్టులు మరికొన్ని నోటిఫికేషన్ లలో రెండు శాతం లోపు ఉద్యోగాలను కేటాయించడం అంటే మాల కులాన్ని అణిచివేసే కుట్రలా ఉందని ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించి రోస్టర్ విధానాన్ని సరిచేయాలని లేదంటే ఆగస్టు 11 నుంచి పెద్ద ఎత్తున పోరాటాలకు మాల మహానాడు సిద్ధమవుతుందని చెన్నయ్య హెచ్చరించారు, రోస్టర్ విధానంలో ఉన్న లోపాల గురించి లిమంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాత్రమే మాట్లాడుతున్నారని మిగతా ఎమ్మెల్యేలు ఎందుకు మౌనంగా ఉన్నారని మీరు ఆయన ప్రశ్నించారు

## గిరిజన కుటుంబాలకు మొక్కల పంపిణీ..

### పర్యావరణ పరిరక్షణకు ఐడీఓ సంస్థ వినూత్న కార్యక్రమం




**చంద్రుగొండ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 3 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామపంచాయతీ ఎర్రబోడు ప్రాంతంలో గిరిజన కుగ్రామ దత్తత కార్యక్రమంలో భాగంగా ఐడీఓ (స్వదేశీ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పెగసిస్టమ్స్ వరల్డ్ వైడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గొత్తికోయ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి మూడు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్ పాల్గొని మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతపై అవగాహన కల్పించారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన గిరిజన కుటుంబాలకు సూచించారు. కార్యక్రమంలో ఐడీఓ సంస్థ నిర్వాహకులు, ఎర్రబోడు ప్రాంత ప్రజలు, గిరిజన కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా మరో ముందడుగుగా నిలిచింది.

## నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తకు దక్కిన సువర్ణ అవకాశం

### కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్‌కు ఘన సన్మానం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య) :** కాంగ్రెస్ పార్టీ కోసం కష్ట కాలం లోనూ అంకిత భా వంతో పనిచేసిన నికార్సైన కార్యకర్తకు గుర్తిం పుగా కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి లభించిందని పలువురు నాయకులు పేర్కొ న్నారు. కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బానోత్ లాల్ సింగ్, వైస్ చైర్మన్ భుక్య జనార్దన్‌తో పాటు నూతనంగా నియమితులైన డైరెక్టర్లను శాలు వాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్‌ను నమ్ముకుని తన వంతు సేవలు అందించిన బానోత్ లాల్ సింగ్‌కు ఈ పదవి దక్కడం కార్యకర్తలకు గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. నూతన బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వహిస్తూ రైతులకు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

### ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య):** సింగరేణి సంస్థను రాజకీయ వేదికగా మార్చి కార్మికుల చెమటను రాజకీయ లాభాలకు ఉపయోగించుకోవద్దని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశంపై మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడాలనుకుంటే అందుకు సరైన వేదిక తెలంగాణ శాసనసభేనని పేర్కొన్నారు. అక్కడ ప్రభుత్వం, అవసరమైతే సింగరేణి యాజమాన్యం అధికారికంగా సమాధానం ఇస్తుందని, కానీ గనుల వద్ద మీడియా సమావేశాలు నిర్వహిస్తూ సంస్థను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల సింగరేణి ప్రతిష్ఠ దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 7.5 మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి చూపించారంటూ అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ బహిరంగంగా విమర్శించారని గుర్తు చేశారు. అప్పట్లో స్పందించని వారు ఇప్పుడు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు జరిగితే ప్రశ్నించడం ఏఐటీయూసీ విధానమని స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై అనుమానాలు కొత్తవి కావని, గతంలోనూ ఇదే తరహా ఆరోపణలు వచ్చాయని తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ అవసరాల కోసం సింగరేణిని వేదికగా ఉప యోగించుకోవడం సరికాదన్నారు. అయితే సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే రాజకీయాలను ఎవరు చేసినా ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మాజీ మంత్రి హరీష్‌రావు ఏకవచనంతో సంబోధించడం హుందాతనానికి విరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉండవచ్చని, కానీ పరస్పర గౌరవాన్ని కాపాడడం ప్రతి నాయకుడి బాధ్యత అని సూచించారు. మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని చేపట్టిన నిరాహార దీక్ష సందర్భంగా కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని రాజ్‌కుమార్ ఆరోపించారు. బొగ్గు దొంగతనం జరగలేదని కాకుండా, టార్గెట్ రాకపోయినా వచ్చినట్లు తప్పుడు లెక్కలు చూపించడం కూడా తప్పేనని ఆయన చెప్పారని వివరించారు. బొగ్గు దొంగతనం జరిగిందనే ప్రచారం వల్ల కార్మికులు అయోమయానికి గురవుతారని మాత్రమే ఆయన పేర్కొన్నారని తెలిపారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థ పేరును రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం మాను కోవాలని కోరారు. సుమారు 70 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. గనుల వద్ద అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వల్ల కార్మికుల్లో అభద్రత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక రాజకీయ జోక్యం, అవినీతి కారణ ంగా సింగరేణి నష్టపోయిందని, సంస్థ భవిష్యత్తుపై కార్మికుల్లో ఆం దోళన నెలకొందని పేర్కొన్నారు. సింగరేణిని రాజకీయాలకు అతీ తంగా ఉంచడం, కార్మికుల హక్కులను కాపాడడం, సంస్థ ప్రతిష్ఠను పరిరక్షించడం, సంస్థ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడమే ఏఐటీ యూసీ లక్ష్యమని కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ విష యంలో కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# జాతి ఐక్యతే ఏకైక లక్ష్యం : భూక్య సంజీవ్ నాయక్

### మేయర్, మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

### జేఏసీ చైర్మన్‌గా బానోత్ వీరూ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య):** బంజారా జాతి హక్కుల సాధనకు ఐక్యతే మార్గమని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్, వైస్ చైర్మన్ భూక్య జనార్ధన్, డైరెక్టర్లు మరియు పలువురు ప్రజాప్రతినిధులను శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భూక్య సంజీవ్ నాయక్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో బంజారాల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. జాతి అభ్యున్నతి కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, యువత కలిసి పనిచేయాలని, బంజారాలకు దక్కాల్సిన హక్కులు, సంక్షేమ పథకాల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తాం : మేయర్ గణేష్ నాయక్**

మేయర్ మూడ్ గణేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బంజారాలకు ప్రత్యేక కమ్యూనిటీ భవనం లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెంలో బంజారా భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు.

**రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తాం: లాల్‌సింగ్**

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్ మాట్లాడుతూ కొత్తగూడెం మార్కెట్ కమిటీని మళ్లీ చైతన్యవంతం చేస్తామని చెప్పారు. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లి, పాల్వంచ, చంద్రుగొండ ప్రాంతాల రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించి అన్ని రకాల పంటల కొనుగోళ్లకు అనుకూల వాతావరణం కల్పిస్తామని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

**హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: హుస్సేన్ నాయక్**

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ బంజారాల హక్కుల సాధనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంపై జరుగుతున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని, సంఘటిత శక్తితో ముందుకు సాగాలని సూచించారు.

**సంప్రదాయాలను కాపాడుకోవాలి: డాక్టర్ శంకర్ నాయక్**

బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**జేఏసీ చైర్మన్‌గా వీరూ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక**

సమావేశంలో బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్‌గా బానోత్ వీరూ నాయక్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరూ నాయక్ మాట్లాడుతూ బంజారాల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు, యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బంజారా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పిసిసిఎఫ్ వినయ్ కుమార్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 3. :** అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనం పెంపుదల పై ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశం అటవీ సంపద సంరక్షణకు విశేష కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం వార్షిక అవార్డుల ఉత్తర్వులు జారీచేయడంలో చొరవ చూపి నందుకు గాను మంత్రి సురేఖకు ధన్యవాదాలు తెలిపిన పిసిసిఎఫ్ తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ శ్రీమతి సువర్ణను చీరతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపి, అటవీశాఖకు సువర్ణ అందించిన విశిష్ట సేవలను కొనియాడిన మంత్రి సురేఖ రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ ఈ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ ని జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకుగాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ కి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. మాజీ పిసిసిఎఫ్ ను సత్కరించి, అభినందలను తెలిపిన మంత్రి కొండా సురేఖ పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ శ్రీమతి సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# అన్నపురెడ్డిపల్లిలో తూకం దోపిడీ..

### గిరిజనులను నిలువునా దోచేస్తున్న వ్యాపారులు!

### కిలోకు కోత.. ఎంఆర్పీకి మించి వసూళ్లు..

### నిద్రమత్తులో తూనికలు, కొలతల శాఖ

చంద్రుగొండ ప్రతినిధి, జూలై 03 (వార్త సంధ్య) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని అన్నపురెడ్డిపల్లిలో తూనికలు, కొలతల్లో జరుగుతున్న అక్రమాలు గిరిజన ప్రజలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. కిలో సరుకు పేరుతో కేవలం 900 గ్రాములు మాత్రమే తూకం వేయడం, వస్తువులపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే అధికంగా వసూలు చేయడం వంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత లీగల్ మెట్రోలజీ (తూనికలు, కొలతలు) శాఖ అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియమాలు గాలికొదిలేసిన వ్యాపారులు


ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి ఉపయోగించే త్రాసులు, కొలత పరికరాలు లీగల్ మెట్రోలజీ శాఖ ధృవీకరణ పొందడంతో పాటు ప్రతి ఏడాది స్టాంపింగ్ చేయించుకోవాలి. కానీ అన్నపురెడ్డిపల్లి మండలంలో చాలా దుకాణాల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదని, ఏళ్ల తరబడి తనిఖీలు కూడా సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

డిజిటల్ త్రాసులతో మోసం

డిజిటల్ త్రాసుల ద్వారా బరువులో కోత విధించడం సాధారణంగా మారిందని వినియోగదారులు చెబుతున్నారు. కిలో సరుకు అడిగితే తక్కువ బరువు ఇచ్చి పూర్తి ధర వసూలు చేస్తున్నారని, దీనివల్ల ప్రతి కొనుగోలులో వినియోగదారులు నష్టపోతున్నారని అంటున్నారు.

పెట్రోల్ బంకులపై కూడా అనుమానాలు

మండలంలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో కూడా ఇంధన పరిమాణం, నాణ్యతపై వాహనదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ మీటర్‌లో చూపించే రీడింగ్‌కు, వాహనంలో పడుతున్న ఇంధనానికి తేడా ఉందని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై కూడా అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.




గిరిజనుల అమాయకత్వమే అవకాశంగా...

మారుమూల గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు ఎంఆర్పీ ధరలు, తూకం, నాణ్యత వంటి అంశాలపై అవగాహన లేకపోవడాన్ని కొందరు వ్యాపారులు అవకాశంగా మార్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. తయారీ తేదీ, గడువు ముగింపు తేదీలు స్పష్టంగా లేని వస్తువులను కూడా విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

ప్రజల డిమాండ్

అన్నపురెడ్డిపల్లి మండలంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మండల స్థాయిలో ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

# జూలై 10 రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

## ప్రభుత్వ పాఠశాలల కుదింపును ఉపసంహరించుకోవాలి

## వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య) :** రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ సన్నాహక సమావేశం కొత్తగూడెం పట్టణంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు వరక అజిత్, బుర్ర వీరభద్రం, మంద నాగకృష్ణ, దుర్గం ప్రణయ్ పాల్గొని




మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ విద్యను వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యారంగానికి తగిన స్థాయిలో బడ్జెట్ కేటాయించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని, పాఠ్యపుస్తకాలు, యూని ఫాంలను బలవంతంగా విక్రయించే విధానాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందించాలని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు పరిరక్షణ కోసం జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో పీడీఎస్‌యూ నాయకులు హర్షవర్ధన్, సాగర్, నవీన్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, దిలీప్‌కుమార్, విద్యాసాగర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సృజన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం తెలంగాణ రైతులకు వరం

## సహకార వారోత్సవాల సందర్భంగా రైతులతో ముఖాముఖి

## పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ఒక వరమని పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సహకార వారోత్సవాలు జూన్ 29 నుంచి జూలై 6 వరకు జరుగుతున్న నేపథ్యంలో శు క్రవారం పాల్వంచ సహకార సంఘం కార్యాలయంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న వివిధ సేవలను ఆయన వివరించారు. కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీపై రుణాలు, సబ్సిడీ ధరలకు విత్తనాల పంపిణీ, ఎంఆర్పీ ధరలకే ఎరువుల సరఫరా, సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్, రైతు రుణమాఫీ వంటి పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సహకార సంఘాలు రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, సహకార వారోత్సవాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ. లక్ష్మీ హరిత, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, సామ జనార్దన్ రెడ్డి, జరబణ సీతారాం బాబు, యర్రంశెట్టి మధుసూదన్ రావు, భూక్యా కిషన్, సొసైటీ సీఈఓ జి. లక్ష్మీనారాయణ, లక్ష్మి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మసూద్ అందించిన సేవలు చిరస్మరణీయం

## కొత్తగూడెం ఒక ఉత్తమ నాయకుడిని కోల్పోయింది

## బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 03 (వార్త సంధ్య) :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ మసూద్ మృతి కొత్తగూడెం పట్టణానికి తీరని లోటని, ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన గణేష్‌బస్తీకి చెందిన షేక్ మసూద్ పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం రూపంలో కొత్తగూడెం ఒక ఉత్తమ నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజాసేవలో మసూద్ అందించిన సేవలను కొనియాడుతూ, ఆయన మరణం పట్టణ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. మసూద్ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ఆయన భార్య, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 54వ డివిజన్ కార్పొరేటర్ జయంతి మసూద్‌కు, ఇద్దరు పిల్లలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, నాయకులు ఎండి యూసుఫ్, పల్లపోతు సాయి, పి. సత్యనారాయణచారి, నయీమ్ ఖురేషి, ఇర్ఫాన్, ధన్‌రాజ్, అస్మత్, ఇమ్రాన్ తదితరులు పాల్గొని మసూద్‌కు నివాళులర్పించారు.

# ఉద్యమము లో పాల్గొన్న వారందరూ ఉద్యమకారులుగా గుర్తించండి

## మెతుకు ఉప్పలయ్య ఉద్యమ కారుడు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మొకిరాల ఉద్రాసీన్ కోరారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 3** : ఉద్యమము లో పాల్గొన్నందుకు ఉపాధి , ఉద్యోగం కోల్పోయిన వారు తెలంగాణ పేరుమీద ఏర్పాటు చేసిన వివిధ అసోసియేషన్ వ్యవస్థాపకులకు ఎలాంటి కేసులు లేని వారిని తెలంగాణ సాధన ఉద్యమకారులుగా గుర్తింపు కార్డులు కాల యాపన లేకుండా. ఇవ్వాలని తెలంగాణ సెజ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్ప లయ్య , ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మొకిరాల ఉద్రాసీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్య మం వివిధ రంగాల సంఘాల తో ఏర్పాటు అయినందున. సమైక్యాంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ పేరుతో వివిధ అసోసియేషన్లు రిజిస్టర్డ్ అయి ఉద్యమం లో పాల్గొన్న ఎలాంటి కేసులు లేని వివిధ సంఘాల వ్యవ స్థాపక కార్యవర్గ సభ్యులను ఉద్యమకారులుగా గుర్తింపు ఇచ్చి ప్రత్యేక కేటగిరి వర్తింప చేయుట 5వ కేటగిరి లోరిజిస్ట్రేషన్ పత్రాల ఆధారం గుర్తింపు తెలంగాణ సాధన ఉద్యమ కార్య క్రమంలో పాల్గొన్నం దుకు ఉన్న ఉపాధి ఉద్యోగం కోల్పోయి ఎలాంటి కేసులు లేని వారిని కూడా ఉద్యమ కారులు గా ప్రత్యేక కేటగిరి వర్తింప చేయాలని వారు కోరారు అధికారుల లేఖలు ఆధారముగా .తెలం గాణ సాధన ఉద్యమం లో పాల్గొన్నందుకు ఎలాంటి లేదా ఏ విధముగా నైనా నష్టపోయిన ఎలాంటి కేసులు లేని వారినికూడా వారిని ఉద్యమ కారులుగా గుర్తింపు ఇవ్వాలని అలాగే ఫోటో ల ద్వారా గుర్తింపు. వీడియో ల ద్వారా గుర్తింపు., . లేఖలు ద్వారా గుర్తింపు, (వ్రాతపూర్వకం ధృవీకరణ) ఉద్యమ కారుల గుర్తింపు విధానం లో నియామకం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కేసులు లేకుండా కవులు,కళాకారులు,ప్రైవేట్ ఉద్యోగులు, వివిధ వర్గాలకు చెందిన వాళ్ళు ఉద్యమకారులు గుర్తించబడాలని వారు ఆకాంక్షించారు

# కేపీహెచ్‌బీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దెంది అరవింద్ రెడ్డి: బండి రమేష్ ఘన సన్మానం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దెంది అరవింద్ రెడ్డిని తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అరవింద్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు తనపై నమ్మకంతో కేపీహెచ్‌బీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు బండి రమేష్‌కు మరియు పార్టీ అధిష్ఠానానికి అరవింద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, తనకు అప్పగించిన ఈ బాధ్యతను ఎంతో గౌరవంగా భావిస్తూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించిన మైనారిటీస్ సంక్షేమ - ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 3 :** తెలంగాణ రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి జీవనోపాధి అవకాశాలను మరింత విస్తరించే దిశగా మైనారిటీస్ సంక్షేమ మరియు ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ , ఈ రోజు డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాల యంలోని తన ఛాంబర్ (రూమ్ నెం.21, మొదటి అంతస్తు)లో తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనారిటీ మహిళల కోసం కుట్టు మిషన్ పథకం, అలాగే మోటార్ బైక్ / ఈ-బైక్ / స్కూటీ / ఈ-స్కూటర్ మరియు చిన్న వ్యాపార (పెట్టీ బిజినెస్) పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను మంత్రి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి స్వయం ఉపాధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పారదర్శకత, సాంకేతికత ఆధారిత సేవలు మరియు ప్రజలకు సులభంగా అందు




బాటులో ఉండే విధానాల ద్వారా యువత, మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పథకాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మైనారిటీస్ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ , తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దీపక్ జాన్ , మైనారిటీస్ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. షఫీయుల్లా, × ఐ ఎఫ్‌ఎఫ్ మైనారిటీస్ సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీ అబ్దుల్ హమీద్, ఐఏఎస్, టీజీసీఎంఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి పి. సవిత , హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు మైనారిటీస్ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు 03 జూలై 2026 నుండి 18 జూలై 2026 సాయంత్రం 5:00 గంటల వరకు tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**అర్హతలు:** కుట్టు మిషన్ పెట్టీ బిజినెస్ పథకాలకు వయస్సు 21 నుండి 55 సంవత్సరాలు. - మోటార్ బైక్ / ఈ-బైక్ / స్కూటీ / ఈ-స్కూటర్ పథకాలకు వయస్సు 21 నుండి 50 సంవత్సరాలు. - కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000 లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 లోపు ఉండాలి. మరిన్ని వివరాలకు 040-23391067 నంబర్‌ను సంప్రదించవచ్చు లేదా tscmfc.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం, స్వయం ఉపాధి, పారదర్శక పాలన సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మరోసారి స్పష్టం చేశారు.

# జేఎన్టీయూ =22 విద్యార్థులకు గ్రేస్ మార్కులు మంజూరు

## స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం పోరాటానికి లభించిన విజయం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జేఎన్టీయూ =22 రెగ్యులేషన్ విద్యార్థులకు గ్రేస్ మార్కులను మంజూరు చేస్తూ విశ్వవిద్యాలయ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. వేలాది మంది ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వారికి ఎంతో ధైర్యాన్ని ఇవ్వనుందని పేర్కొంది. =22 విద్యార్థులకు గ్రేస్ మార్కులు అమలు చేయాలంటూ గత కొంతకాలంగా నిరంతరం పోరాడుతూ, అధికారులకు అనేక మార్లు వినతి పత్రాలు సమర్పించింది. గ్రేస్ మార్కుల మంజూరుతో వేలాది మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేయడం, పైచదువులకు ప్రవేశాలు పొందడం, ఉద్యోగ అవకాశాలను అందుకోవడం వంటి ఇబ్బందుల నుంచి గట్టెక్కనున్నారు.ఈ నిర్ణయం వేలాది మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పిఎఫ్ నాయకుడు రాజ్ కుమార్ అన్నారు. విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసం తమ ఫోరం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీను, సాగర్, జయరాం, ఆనంద్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# మన ప్రియతమ నాయకుడు - కిషన్ కు అరుదైన గౌరవం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 3.:** కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి కేంద్ర మంత్రివర్గంలో మొదటి స్థానంలో నిలిచి, తెలంగాణ ప్రజల గౌరవాన్ని ఢిల్లీలో నిలబెట్టిన మన కిషన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి అత్యంత ఆప్తునిగా, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కి ప్రియ శిష్యుని గా, కేంద్రంలోని అందరు మంత్రులకు ఆప్తులు గా కొనసాగుతున్న నాయకుడు మన కిషన్ సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులుగా రెండు పర్యాయాలు ఘన విజయం సాధించి, ప్రజలకు నిస్వార్థం గా సేవ చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధిలితో పాటు, ఎన్నో అభివృద్ధి పను లతో సికింద్రాబాద్ రూపురేఖలు మారు స్తున్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తికి మరెన్నో గౌరవాలు, పదవులు రావాలని, ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# రవీంద్రభారతిలో ప్రేక్షకులను అలరించిన ఆంధ్రనాట్యం, కూచిపూడి నృత్య వైభవం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 3 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వ హిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 94వ రోజు (03-07-2026) రవీంద్ర భారతి లోని పాల్కురికి సోమన్న మూల వేదిక కళా వైభవంతో కళకళ లాడింది. సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంకు చెంది న నాట్య గురువులు శ్రీమతి వనజా ఉదయ్, శ్రీమతి సాత్విక పెన్న శిష్యులు సాత్విక, మనస్విని, సాయి కుమార్, శ్రీమతి కళ్యాణి, శ్రీమతి దివ్యలు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలు అందు కున్నాయి. శాస్త్రీయ నృత్యంలోని హావభావాలు, లయబద్ధమైన అడుగులు, ఆకర్షణీయమైన అభినయంతో కళా కారులు సభికులను మంత్రముగ్ధులను చేశారు.అనంతరం విశ్వవిద్యాలయం రంగస్థల విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాజు శిష్యులు ప్రదర్శించిన సామాజిక సందేశాత్మక స్కిట్లు ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్, సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ కళా కారు లను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్, పల్లె నర్సింహ కార్యక్రమంలో పాల్గొని కళాకారులను అభినందిస్తూ వారి ప్రతిభను కొనియాడారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించే గీతాలతో పాటు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభలో ఉత్తేజభరితమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమానికి విద్యానందాచారి శ్రీనివాస రాజు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి తమ చక్కని వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారు.

# చెట్టు కొమ్మ విరిగి రోజులైనా పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు..!

## జూలూరుపాడు రహదారిపై ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మ

## వాహనదారుల ప్రాణాలతో చెలగాటమా..? రహదారిపై వేలాడుతున్న చెట్టు కొమ్మ

## ఎప్పుడు విరిగి పడుతుందోనని భయంతో ప్రయాణిస్తున్న వాహనదారులు




**చంద్రుగొండ ప్రతినిధి, జూలై 3 (వార్త సంధ్య):** చంద్రుగొండ మండలం నుంచి జూలూరుపాడుకు వెళ్లే ప్రధాన రహదారిలో పోకలగూడం గ్రామ శివారులో రహదారి పక్కన ఉన్న ఓ భారీ చెట్టు కొమ్మ విరిగి చాలా రోజులుగా ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్నా సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రతిరోజూ ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ప్రమాదాన్ని నివారించే చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలమైన గాలులు లేదా వర్షం కురిసిన సమయంలో ఆ కొమ్మ పూర్తిగా విరిగి రహదారిపై పడితే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవాలని, వెంటనే చెట్టు కొమ్మను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని వాహనదారులు, ప్రజలు ఆర్ అండ్ బి శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# 'ఇదేం పాకిస్థాన్ కాదు': కానిస్టేబుల్ వ్యాఖ్యలపై విచారణ

## హైదరాబాద్‌లో పార్కింగ్ వివాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ మతపరమైన వ్యాఖ్యలు

## "ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అంటూ వ్యాఖ్య

## బాధిత కుటుంబ సభ్యుల నుంచి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు

## కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ ప్రారంభించిన సైబరాబాద్ పోలీసులు

పార్కింగ్ విషయంలో ఒక మహిళతో తలెత్తిన వివాదంలో "ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అంటూ మతపరమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు ఒక కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ చేపట్టారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం గచ్చిబౌలి-రాయదుర్గం మార్గంలోని ఐకియా ఎగ్జిట్ వద్ద గల బీపీ పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు ప్రకారం, ఒక మహిళ, ఆమె కుమారుడు తమ మోటార్‌సైకిల్‌ను బారికేడ్ల వెనుక ఇతర వాహనాలతో పాటు పార్క్ చేశారు. వారు తిరిగి వచ్చిన తర్వాత బారికేడ్లను తొలగించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ జె. మల్లేశంను కోరగా, ఆయన అందుకు నిరాకరించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తిస్తూ, "మీకు నచ్చిన చోట వాహనాలు పార్క్ చేయడానికి ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అని అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ స్పందిస్తూ, సదరు కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ ప్రారంభించామని, విచారణ పూర్తయిన తర్వాత నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, వివాదం జరుగుతున్న సమయంలో కానిస్టేబుల్ తన వ్యక్తిగత ఫోన్‌లో సంభాషణను రికార్డు చేశాడని బాధితుడు సమీర్ తన ఫిర్యాదులో వెల్లడించారు.

# తెలంగాణ రాష్ట్రంలో వీబీ జీ రాంజీ అమలు

**కొత్త చట్టంలోని ఆ నిబంధనలపై సుప్రీంకోర్టుకు**

**ముఖ్యమంత్రి అధ్యక్షతన తొలి డిజిటల్ కేబినెట్ సమావేశం**

**వీబీజీరాం జీ చట్టం అమలు చేసే అంశంపై కేబినెట్‌లో చర్చ**

**సుమారు రూ.7,345 కోట్లతో మూసీ ప్రాజెక్టు మొదటి దశ ప్రాజెక్టుకు ఆమోదం**



కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రాం జీ చట్టంపై న్యాయపోరాటం చేస్తూనే రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సుమారు రూ.7 వేల 345 కోట్లతో మూసీ ప్రాజెక్టు మొదటి దశ ప్రాజెక్టు చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయించింది. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6 వేల 278 పోస్టులను మంజూరు చేసింది.వీబీ జీ రాంజీ పథకంపై నిరసన తెలుపుతూనే తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు నోటిఫికేషన్ ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తొలి డిజిటల్ కేబినెట్ సమావేశం గురువారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వీబీ జీ రాం జీ చట్టం రాష్ట్రంలో అమలు చేసే అంశంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రాలను సంప్రదించకుండా, కనీసం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా వీబీ జీ రాంజీ చట్టాన్ని కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిందంటూ కేబినెట్ మరోసారి నిరసన తెలిపింది. అయితే కొత్త చట్టంలో విధించిన నిబంధనలపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రం తీరును నిలదీయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మొదటి దశ పనులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కేబినెట్ నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌తో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 6 వేల 278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులను కేబినెట్ మంజూరు చేసింది. ఆ ఆస్పత్రుల్లో వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌వోసీలు కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలకు భిన్నంగా, దేశంలోని కూలీల అభిప్రాయాలకు భిన్నంగా ఉపాధి హామీని వీబీ జీ రాంజీ పేరుతో ఒంటెద్దు పోకడతో ఈ నెల 1న ప్రవేశపెట్టారు. కొన్ని రాష్ట్రాలు అనివార్యంగా ఒప్పుకున్నట్లు తెలంగాణ కూడా గత్యంతరం లేక అంగీకరించాల్సి వచ్చింది. న్యాయపరంగా అప్రోచ్ అవ్వాలని కేబినెట్ తీర్మానించటం జరిగింది.గోదాములు, జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు పలుచోట్ల భూములను కేటాయించింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంటలో నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి 50 ఎకరాల్ని, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్‌లో 10 ఎకరాలను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేట్ ప్రకారం కేటాయించేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలం కేటాయించింది.మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19 ఎకరాల ప్రభుత్వ భూమిని కేబినెట్ కేటాయించింది. జగిత్యాల జిల్లా చల్‌గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. ఉత్తర తెలంగాణలోని రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ఎకరం చొప్పున కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అటు వర్షాభావ పరిస్థితులు ఉన్నందున గ్రామాల్లో తాగునీటికి సమస్య రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ చర్చించింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని, దీనిపై అవసరమైతే కేబినెట్ సబ్ కమిటీ వేయాలని చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ మంత్రివర్గ సమావేశానికి హాజరు కాలేదు.

# లీజుకు రుషికొండ ప్యాలెస్ భవనాలు

**ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద అప్పగింత**

**ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు ఏపీటీడీసీ ఈఓఐ ఆహ్వానం**

**ముందుకొచ్చిన అంతర్జాతీయ హోటల్ గ్రూపులు**

**ఆసక్తి వ్యక్తీకరణ కోరిన ఏపీటీడీసీ**



విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మించిన అత్యాధునిక ప్యాలెస్ భవనాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంలో నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను ప్రారంభిస్తూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆసక్తి వ్యక్తీకరణ కోసం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పర్యాటక, ఆతిథ్య రంగంలో అనుభవం ఉన్న సంస్థలు జూలై 10లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించింది.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.452 కోట్ల ప్రజాధనంతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లు గడిచినా ఈ భవనాల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల మంత్రుల కమిటీ రుషికొండ భవనాలను పరిశీలించి, వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహించడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లీజు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.రుషికొండపై సుమారు 9.8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఐదు బ్లాకుల భవనాలను లీజుకు ఇవ్వనున్నారు. భవనాలతో పాటు సుందరమైన ఉద్యానవనాలు, అంతర్గత రహదారులు, నడక మార్గాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు వంటి అన్ని మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఏపీటీడీసీ వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయి అతిథ్య సేవలకు అనుగుణంగా ఈ సముదాయం సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు సుమారు 1,200 చదరపు మీటర్ల ఖాళీ స్థలం కూడా లీజుదారులకు అందుబాటులో ఉంటుందని ఏపీటీడీసీ తెలిపింది. అలాగే మొత్తం 4,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్ వన్ (జీం1) భవనాలను నిర్మించుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. దీనివల్ల భవిష్యత్తులో గదుల సంఖ్యను పెంచుకొని పర్యాటకులకు మరింత మెరుగైన సేవలు అందించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు.రుషికొండ ప్యాలెస్‌ల నిర్వహణపై ఇప్పటికే పలు ప్రముఖ అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి వ్యక్తం చేశాయి. తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి ప్రముఖ ఆతిథ్య సంస్థల ప్రతినిధులు గతంలోనే భవనాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఉన్న గదుల సంఖ్య భారీ స్థాయి హోటల్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల రిసార్ట్ లేదా లగ్జరీ హోటల్‌గా అభివృద్ధి చేసే అవకాశాలు పెరిగాయి. రుషికొండ సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈ కారణంగా విస్తృత స్థాయిలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు పరిమితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ సీఆర్‌జడ్ నిబంధనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది.70 ఎకరాలకు పైగా పర్యాటకశాఖ భూమి : రుషికొండ ప్రాంతంలో పర్యాటకశాఖకు మొత్తం 70.63 ఎకరాల భూమి ఉంది. ఇందులో 18.65 ఎకరాలు ప్రస్తుతం వినియోగంలో ఉండగా, సుమారు 47.4 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. మరికొంత భూమి ఆక్రమణలకు గురైనట్లు అధికారిక సమాచారం సూచిస్తోంది. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# కేబినెట్ భేటీలో మూసీపై వాడీవేడి చర్చ!

**ప్రాజెక్టుపై సీఎం సమగ్ర వివరణ**

**కేబినెట్ భేటీలో మూసీ ప్రాజెక్టుపై వాడీవేడి చర్చ**

**నదిలోకి మంచినీళ్లు ఎక్కడి నుంచి వస్తాయన్న ఉత్తమ్**

**ప్రతిపక్షాల్లా మాట్లాడితే ఎలాగన్న మరో సీనియర్ మంత్రి**

**ప్రాజెక్టుపై సమగ్రంగా వివరించిన ముఖ్యమంత్రి**



కేబినెట్ భేటీలో మూసీ ప్రాజెక్టుపై వాడీవేడి చర్చ జరిగినట్లు సమాచారం. మూసీ నదిలోకి మంచి నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతల మాదిరిగా మాట్లాడితే ఎలాగని ఉత్తమ్‌ను ఓ సీనియర్ మంత్రి అడిగినట్లు తెలిసింది. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం, మూసీ ప్రాజెక్టు గురించి సమగ్రంగా వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాల ఫైళ్లు కేబినెట్ ముందుకు ఎందుకు రావడం లేదని ఉత్తమ్ ప్రశ్నించగా, వచ్చే కేబినెట్ భేటీలో ముఖ్య ఎజెండాగా చర్చిద్దామని సీఎం అన్నట్లు సమాచారం.మూసీ పునరుజ్జీవం పనులతో పాటు సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాలపై మంత్రివర్గ సమావేశంలో వాడీవేడి చర్చ జరిగినట్లు తెలిసింది. మంత్రివర్గ సమావేశంలో మూసీ ప్రాజెక్టు మొదటి దశ అంచనాల ఆమోదం ఎజెండా వచ్చిన సమయంలో మూసీకి మంచినీళ్లు ఎక్కడి నుంచి వస్తాయంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ పథకానికి నీటిని ఎక్కడి నుంచి తెస్తారు ఎత్తిపోసే 20 టీఎంసీలలో 17.5 టీఎంసీలు తాగునీటికి పోతే, మిగిలిన రెండున్నర టీఎంసీలు మొత్తం వస్తుందా అని అడిగినట్లు సమాచారం. మూసీపై చేసే ఖర్చు, ఆదాయం రేషియో ఏమిటని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ఓ సీనియర్ మంత్రి ప్రతిపక్ష నేతల మాదిరే మనం మాట్లాడితే ఎలాగని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.హైదరాబాద్ రూపురేఖలు మారాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాల్సిందేనని అన్నట్లు సమాచారం. ఈ దశలో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అందరూ హర్షిస్తున్నారని తెలిపారు. విపక్షానికి చెందిన ఓ నాయకుడు మాత్రం మూసీని పునరుద్ధరణ జరగనివ్వబోమని చాలా గట్టిగా మాట్లాడుతున్నారని, అలాంటి వారికి బలంగా సమాధానం చెప్పాల్సింది పోయి, మనం కూడా వారి భాషే మాట్లాడితే ఎలా అంటూ ఉత్తమ్ లేవనెత్తిన అంశాలకు సీఎం వివరణ ఇచ్చినట్లు తెలిసింది.సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాల ఫైళ్లు మంత్రివర్గానికే రావడం లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. పొంతనలేని కొర్రీలతో అడ్డుకుంటున్నారని, ఇలా ఎందుకు జరుగుతోందని ఉత్తమ్ అడిగారని సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సమాధానం కోరారు. మంత్రివర్గ సమావేశానికి ఒకరోజు ముందు తన వద్దకు ఫైళ్లు వస్తాయని, సాంకేతిక అంశాల గురించి తెలుసుకోవడానికి సమయం లేకపోవడం వల్లే మంత్రివర్గ సమావేశానికి రాలేదని రామకృష్ణారావు పేర్కొన్నట్లు సమాచారం. ఇవన్నీ చాలా సంవత్సరాలుగా జరుగుతున్న పనులని, అంచనాల సవరింపు తప్పనిసరని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఏదో ఒక అభ్యంతరంతో ఆపేస్తున్నారని ఉత్తమ్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. మళ్లీ జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ నెల 17న జరిగే మంత్రివర్గ సమావేశంలో సవరించిన అంచనాలపైనే మొదట చర్చ ఉంటుందని తెలిపారు. ఆ రోజు వరకు అన్ని ఫైళ్లు సిద్ధం చేయాలని, ఆ ఎజెండా ముగిశాకే వేరే అంశానికి వెళ్దామని స్పష్టం చేశారు. సందేహాలను తీర్చడానికి పూర్తిస్థాయిలో సిద్ధమై రావాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.రాజస్థాన్ సంప్రదాయేతర ఇంధన కార్పొరేషన్‌తో సింగరేణి సంస్థ జాయింట్ వెంచర్‌గా ఏర్పడి 1,500 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై చర్చకు వచ్చినపుడు మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అభ్యంతరం ఎందుకని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై శ్రీధర్‌బాబు పలు అంశాలను లేవనెత్తగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనను మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించాలని, అక్కడ చర్చించిన తర్వాతే కేబినెట్‌కు తేవాలని సీఎం సూచించినట్లు సమాచారం. విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన మంత్రి కొండా సురేఖ జెట్‌లాగ్ కారణంగా మంత్రివర్గ సమావేశానికి హాజరు కాలేదని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

# హైదరాబాద్‌లో హోటళ్లకు మటన్ పేరుతో బీఫ్ సరఫరా.. ఇద్దరి అరెస్ట్!

**మటన్ పేరుతో బీఫ్ విక్రయం.. 50 కిలోల మాంసం సీజ్**

**ఇద్దరిని అరెస్ట్ చేసిన సీసీఎస్, హెచ్-ఫాస్ట్ బృందాలు**

**పలు హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



హైదరాబాద్ నగరంలో మటన్ పేరుతో బీఫ్ అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టయింది. నగరంలోని పలు హోటళ్లకు కల్తీ మాంసాన్ని సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) మరియు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్) సంయుక్తంగా అరెస్ట్ చేశాయి. వారి నుంచి సుమారు 50 కిలోల కల్తీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు జూలై 1న ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఉస్మాన్ మీట్ షాప్ యజమాని మహ్మద్ ఉస్మాన్, అయాన్ బీఫ్ షాప్‌లో పనిచేసే మహ్మద్ జహంగీర్ పాషాలుగా నిందితులను గుర్తించారు. వీరు మటన్‌లో బీఫ్‌ను కలపడం లేదా బీఫ్‌నే మటన్‌గా నమ్మించి హోటళ్లకు అమ్ముతున్నట్లు దర్యాప్తులో తేలింది. పట్టుబడిన నిందితులను తదుపరి విచారణ నిమిత్తం హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసి, ఈ కల్తీ మాంసం సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి. గత నెల జూన్ 19న కూడా ఓ అక్రమ గోడౌన్‌పై దాడి చేసి, నిషేధిత రంగులు వాడి, పదేపదే వాడిన నూనెతో తయారు చేసిన చికెన్ వంటి 110 కిలోల కల్తీ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా ఘటనతో నగరంలోని హోటళ్లలో మాంసం నాణ్యతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపీ కేశినేని చిన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో కొత్తగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ నూతన భవనాలను ఆయన పరిశీలించి నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ క్రమంలోనే విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందితో కేశినేని చిన్ని మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యసేవల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆ తర్వాత రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, తదితర వివరాలను చిన్ని అడిగి తెలుసుకున్నారు.మరోవైపు రోగులు, వారి సహాయకుల కోసం ఆసుపత్రిలో తగినన్ని వెయిటింగ్ హాల్స్ లేవని ఆసుపత్రి సూపరింటెండెంట్, కేశినేని చిన్ని దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చిన్ని, ఎంపీ నిధులతో ఆసుపత్రిలో రెండు వెయిటింగ్ హాళ్లను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చిన్ని పేర్కొన్నారు. ఈ నెల 9న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విజయవాడ రానున్నారని తెలిపారు. ఆ రోజున ఆయన ఈ నూతన క్రిటికల్ కేర్ భవనాలను ప్రజలకు అంకితం చేయనున్నట్లు వివరించారు.అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఈ భవనాలు ముస్తాబవుతున్నాయని చిన్ని వెల్లడించారు. నూతన క్రిటికల్ కేర్ భవనాలు అందుబాటులోకి వస్తే విజయవాడతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇవి కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ విషయంలో వైద్యులు, సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

# సీమ స్టీల్ వర్క్స్ నేడే స్టార్ట్



రాయలసీమ ఉక్కు కల సాకారం దిశగా కీలక అడుగు పడనుంది. రాష్ట్ర విభజన తర్వాత శంకుస్థాపనలకే పరిమితమైన రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ఇవాళ పట్టాలెక్కనున్నాయి. కడప జిల్లా సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు జేఎస్‌డబ్ల్యూ ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభిస్తారు. రెండేళ్లలో తొలిదశ పూర్తిచేసేలా ప్రణాళికలు వేశారు.రాయలసీమ ప్రజలు 2 దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న స్టీల్ ప్లాంట్ కల నెరవేర్చే కొత్త అధ్యాయం నేడు మొదలవబోతోంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లె సమీపంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 2 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించే జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, మొత్తం రెండు దశల్లో పూర్తి కానుంది. మొదటి దశలో 4,500 కోట్లతో 1 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్ ను నిర్మించి వెయ్యిమందికి ప్రత్యక్ష ఉపాధికల్పించనున్నారు. రెండో దశలో 11,850 కోట్లతో మరో మిలియన్ టన్నుల సామర్థ్యానికి విస్తరించి మరో 1,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. మొత్తంగా 2,500 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు, ఈ ప్రాజెక్టు ద్వారా ఏర్పడనున్నాయి.ప్రాజెక్టు స్థలంలో ఇప్పటికే ప్రహరీ గోడ నిర్మాణం, కార్యాలయ భవనాలు, అతిథి గృహం, బోర్‌వెల్, తాగునీటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2వేల కిలోలీటర్ల నీటి సంప్ నిర్మాణం కొనసాగుతోంది. భారీ యంత్రాల కొనుగోలు ప్రక్రియ సైతం జరుగుతోంది. 2028 నవంబర్‌లో యంత్రాల ఏర్పాటు ప్రారంభించి, 2029 ఏప్రిల్‌లో తొలి దశ ఉత్పత్తి, 2034 నాటికి రెండో దశ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉక్కు కర్మాగారానికి అనుబంధంగా 2వేల400 కోట్లతో 400 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టునూ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ఏర్పాటు చేయనుంది.కడప ఉక్కు కర్మాగారానికి 2019లోనే నాటి టీడీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపి శంకుస్థాపన కూడా చేసింది. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ అంటూ పేరు మార్చి మరోసారి పునాదిరాయి వేశారు. పనులు మాత్రం సాగలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించింది.2026 మార్చి 25న 1100 ఎకరాల భూమిని జేఎస్‌డబ్ల్యూ సంస్థకు అధికారికంగా అప్పగించింది. స్టీల్ ప్లాంట్ కార్మికుల టౌన్‌షిప్ కోసం మరో 172 ఎకరాలూ కేటాయించింది. ఈ ఉక్కు కర్మాగారంలో సంప్రదాయ బ్లాస్ట్ ఫర్నేస్ స్థానంలో ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ సాంకేతికత వినియోగిస్తారు. తద్వారా.. కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గి పర్యావరణహిత గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేస్తారు. ఆధునిక ఉక్కు పరిశ్రమల్లో ఒకటిగా ఈ స్టీల్ ప్లాంట్ నిలువనుంది.“ జేఎస్‌డబ్ల్యూ-రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒక ప్రాజెక్టును రెండు దశల్లో చేపడుతోంది. సౌర విద్యుత్ రంగంలో చేసే రూ.2,000 కోట్ల పెట్టుబడితో పాటు, అదనంగా రూ. 16,350 కోట్ల పెట్టుబడి కూడా ఇందులో ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా- పరోక్షంగా 2,500కు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి - ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే.కడప స్టీల్ ఫ్యాక్టరీ చుట్టూ అనుబంధ పరిశ్రమలు, రవాణా, లాజిస్టిక్స్, సేవారంగాల్లో భారీ పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉక్కు, సిమెంట్, విద్యుత్, గనుల రంగాల్లో మొత్తం 50 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలన్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రణాళికలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ ప్రధాన ప్రాజెక్టుగా నిలవనుంది.

# తూర్పు కనుమలను కాపాడండి



తూర్పు కనుమలు ఉత్తరాంధ్ర జీవనాడి. ప్రస్తుతం ఈ కనుమలు ప్రమాదం అంచున ఉన్నాయి. అడవులను నరకడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉత్తరాంధ్రకు నీటిని అందించే అనేక వాగులు... తూర్పు కనుమలు ఉత్తరాంధ్ర జీవనాడి. ప్రస్తుతం ఈ కనుమలు ప్రమాదం అంచున ఉన్నాయి. అడవులను నరకడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉత్తరాంధ్రకు నీటిని అందించే అనేక వాగులు, వంకలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించాలి. ఈ వాగు వంకల పరీవాహక ప్రాంతంలో చెట్లు లేకపోవడంతో వన్య మృగాలు, పలు జాతుల పక్షులు అంతరించిపోయాయి. గిరిజనులకు కూడా అడవి నుంచి వచ్చే ఫలసాయం తగ్గిపోయింది. కేవలం చింత, పనస వంటి అటవీ ఫలసాయం మాత్రమే ప్రస్తుతం గిరిజనులకు లభిస్తోంది. వీరికి ఆదాయం లేకపోవడంతో మనుగడ సమస్య ఏర్పడింది. వీరు ఇప్పుడు మైదానాలకు వలసపోతున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం ఒక సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలి. ఉత్తరాంధ్రకు రాబోయే నీటి కొరతను తప్పించాలంటే ఆ వాగు వంకల ప్రవాహాల వెంట మనం అడవులను సృష్టించాలి. విస్తృతంగా పండ్ల మొక్కలను నాటాలి. స్థానికంగా ఉండే మొక్కలతో అడవులను పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడినవాళ్లం అవుతాము. కాఫీ ప్లాంటేషన్లకు నీడ కోసం వాడుతున్న సిల్వర్, ఓక్ వంటి విదేశీ జాతుల మొక్కల పెంపకాన్ని తగ్గిస్తే మంచిది. స్థానికంగా పెరిగే తెల్ల మద్ది, నల్ల మద్ది, మామిడి, జామ, ఉసిరి, చింత వంటి మొక్కల ద్వారా అడవులు పెంచి కాఫీ, మిరియాల వనాలను వృద్ధి చేయాలి. తద్వారా గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. జంతువులకు, పక్షులకు ఆహారమూ లభిస్తుంది. తూర్పు మన్యంలో నిమ్మ జాతి మొక్కలు విరివిగా పెరుగుతాయి. కాబట్టి నిమ్మ, నారింజ, బత్తాయి, కమల, పంపర పనస వంటి మొక్కలను పెంచాలి. మన్యంలో పండే రాజ్మా చిరుధాన్యాలు వంటి ఉత్పత్తులను కూడా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చవచ్చు. మిరియాలు, కాఫీ, పసుపు, పనస ఆధారంగా మనం విలువ జోడించే సముదాయాలను రూపొందించటం వల్ల వేలాది మంది గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. ఈ మన్యంలో పనస ఎక్కువగా పండేందుకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. అయితే పనస తక్కువగా పండే రాష్ట్రాల్లో పనస విలువ ఆధారిత ఉత్పత్తుల మీద ఎక్కువ ప్రయోగాలు జరుగుతున్నాయి. కానీ విస్తృతంగా పనస పండే తూర్పు మన్యంలో ఈ సౌకర్యాలు గానీ, శిక్షణ గానీ లేదు! స్థానికంగా లభించే వెదురు, కలపతో వస్తువులు, బొమ్మలు తయారు చేయడం గిరిజనులకు నేర్పించాలి. ఇది వారికి ఆదాయాన్ని ఇస్తుంది. పండిన పంటకు విలువ జోడించడం మీద కూడా వారికి శిక్షణనివ్వాలి. వారు తరతరాలుగా ఆచరిస్తున్న కళలను ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఇలా పర్యావరణంపై దృష్టి పెట్టడం ద్వారా నాలుగైదు సంవత్సరాల్లోనే తూర్పు మన్యాన్ని దట్టమైన అడవిగా, వర్షాన్ని గ్రహించే మంచి వనాలుగా మార్చవచ్చు. గిరిజనులున్న భూముల్లో అడవులతో పాటు వ్యవసాయ పర్యాటకాన్ని రూపొందించవచ్చు. ఇప్పటికే ఉన్న పర్యాటకానికి ఈ వ్యవసాయ పర్యాటకం ఊతం ఇస్తుంది. కొత్తగా ఉపాధి అవకాశాలు సృష్టించడానికీ వీలు కలుగుతుంది.

## మీ మెదడుకి పదును ఈ చిత్రం.. గొర్రెపిల్లలో ఉన్న ముఖాలు ఎన్నో చెప్పుకోండి చూద్దాం

అర్ష్‌దీప్ సోని అనే వినియోగదారు ఫేస్‌బుక్‌లో ఒక ఆప్టికల్ భ్రమ చిత్రాన్ని షేర్ చేశారు. ఇది



నెటిజన్లను కలవరపెడుతోంది. మొదటి చూపులో ఇది కొండ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న గొర్రెపిల్ల చిత్రంలా కనిపిస్తుంది. అయితే కళాకారుడు ఈ చిత్రంలో చాలా మానవ ముఖాలను తెలివిగా దాచిపెట్టాడు. ఈ ముఖాలను కనుగొనగలిగే వారిని మేధావులు అంటారు. ప్రస్తుతం ఒక ఆప్టికల్ భ్రమ చిత్రం సోషల్ మీడియాలో చక్కట్లు కొడుతోంది. ఇది మేథస్సుకి పదును పెడుతుంది. దీనిలో ఇంటర్నెట్ వినియోగదారులు గొర్రెపిల్లలా కనిపిస్తున్న ఆప్టికల్ భ్రమ ఫోటోలో దాగి ఉన్న మానవ ముఖాలను కనుగొనమంటూ సవాల్ విసిరారు. ఇటువంటి ఫోటో పజిల్స్ పరిశీలన నైపుణ్యాలను మెరుగుపరచడమే కాదు మీ విమర్శనాత్మక ఆలోచనను కూడా పెంచుతాయని తెలిసిందే. ఈ ఆప్టికల్ ఇల్యూషన్‌ను అర్ష్‌దీప్ సోని అనే యూజర్ ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. ఇది నెటిజన్లను ఆశ్చర్యపరిచింది. మొదటి సారి చూస్తే ఈ ఫోటోలో ఉంది ఇది కొండ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న గొర్రెపిల్లలా కనిపిస్తుంది. అయితే ఇది సాధారణ చిత్రం కాదు. ఇందులో కళాకారుడు చాలా మానవ ముఖాలను కూడా తెలివిగా దాచిపెట్టాడు. వాటిని గుర్తించే వ్యక్తిని మేధావి అని పిలుస్తారు. అయితే ఈ ముఖాలను వెంటనే గుర్తించడం కష్టం. అందుకే దీనిని ఆప్టికల్ భ్రమకు సరైన ఉదాహరణగా పిలుస్తున్నారు. ఈ డ్రాయింగ్‌లో మీరు ఎన్ని దాచిన ముఖాలను కనుగొనగలరనేది నిజమైన సవాలు. మరి మీరు ఈ సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా? ఇప్పుడు క్రింద ఇవ్వబడిన చిత్రాన్ని జాగ్రత్తగా చూసి.. మీరు ఎన్ని ముఖాలను చూశారో మాకు చెప్పండి? మీరు 5 , 10, 15 ముఖాలా అనేవి గుర్తించండి. వాస్తవంగా ఈ ఫోటోలో ఎన్ని ముఖాలు దాగున్నాయో గుర్తించడం నిజమైన సరదా.. అవును నిజంగా ఆ ఫోటోలో దాగున్న ముఖాలను కనుగొనడం ఒక ఫన్నీ ఫీలింగ్..


## ఈ కూరగాయను తక్కువ అంచనా వేయకండి.. ఎన్నో రోగాలకు మందు ఇది..!





అందరూ ఎక్కువగా ఇష్టపడే కూరగాయల లిస్ట్‌లో వంకాయ ఉండకపోవచ్చు. కానీ దీనిలో ఉన్న పోషకాల విలువ మాత్రం చాలా ఎక్కువ. ఇది ఎన్నో వ్యాధులతో పోరాడే శక్తిని సహజంగా ఇవ్వగలదు. దీని రుచి నచ్చక తినని వాళ్లైనా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ప్రతిరోజూ తినే అలవాటు చేసుకుంటారు. రోజువారీ ఆహారంలో మనం ఎన్నో కూరగాయలు వాడుతాం. కానీ కొన్ని సార్లు వంకాయను తినం.. ఎందుకంటే దాని రుచి నచ్చదని అంటాం. కానీ మనం దీన్ని పూర్తిగా తినకపోవడం ఆరోగ్యానికి ఉపయోగపడే గొప్ప ఔషధాన్ని దూరం చేసుకున్నట్లే అవుతుంది. వంకాయలో ఫైటోన్యూట్రియంట్స్ అనే రసాయనాలు మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి మెదడులోని నర కణాల మధ్య సంబంధాన్ని బలోపేతం చేస్తాయి. దాని వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమరుపు తగ్గుతుంది. ఇందులో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల రోజూ తింటే ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలం తగ్గకుండా ఉండాలంటే వంకాయ మంచి సహాయం చేస్తుంది. వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మాంగనీస్ శరీరంలోని కణాలను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడి.. క్యాన్సర్ కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. వంకాయలో ఐరన్ ఉండటం వల్ల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిని పెంచే అవకాశం ఉంటుంది. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా రక్తహీనత (ఎనిమియా) సమస్యలను తగ్గించవచ్చు. నీరసంగా, అలసటతో ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. డయాబెటిస్ ఉన్నవారు కూడా వంకాయ తినవచ్చు. ఇందులో ఉండే పాలిఫినాల్స్ రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది తోడ్పడుతుంది. వంకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఫలితంగా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఆయుర్వేద నిపుణుల మాటల ప్రకారం.. వంకాయ నిద్రలేమి లాంటి సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలోని అధిక వేడిని తగ్గించి, తల నొప్పి, మలబద్ధకం, గొంతులో గరగర, వాంతులు, శరీరంలో వాపులు, వాత రోగాలకు ఉపశమనం ఇస్తుంది. మొదటి దశలో ఉన్న కిడ్నీ రాళ్లను కరిగించే గుణం కూడా దీనిలో ఉంది. ఈ కూరగాయను మీరు ఇష్టపడకపోయినా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం విస్మరించలేనివి. రోజూ వంకాయను తక్కువ మోతాదులో ఆహారంలో చేర్చడం ద్వారా మన ఆరోగ్యాన్ని చాలా మెరుగుపరుచుకోవచ్చు.

# కిడ్నీలు ప్రమాదంలో ఉంటే కంటిలో కనిపించే సీక్రెట్ లక్షణాలు ఇవే!











మానవ శరీరంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. శరీరంలోని విషాన్ని బయటకు పంపిచడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అందుకే కిడ్నీల ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తారు ఆరోగ్య నిపుణులు. అయితే ఇప్పుడున్న జీవన శైలీ, తీసుకుంటున్న ఆహారం కారణంగా చాలా మంది కిడ్నీ ఫెయిల్యూర్ వంటి చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయితే కిడ్నీలు ప్రమాదంలో ఉంటే కళ్లలో పలు లక్షణాలు కనిపిస్తాయంట. అవి ఏవో ఇప్పుడు చూద్దాం.

**ఉబ్బిన కళ్లు :** కళ్లు ఉబ్బడం అనేది కొన్నిసార్లు సహజం. అయితే కంటి నిండా నిద్రపోయినా, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తే.. రోజుల తరబడి ఇలానే జరిగితే కాస్త జాగ్రత్తపడాలి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే. కొన్ని సార్లు మూత్రపిండాలు దెబ్బతింటే కూడా కళ్లు ఉబ్బినట్లు కనిపిస్తాయంట. దీనిని ప్రోటీన్యూరియా అంటారంట. అందుకే ఈ విషయంలో కాస్త జాగ్రత్త అవసరం.

**అస్పష్టమైన కంటి చూపు :** మూత్రపిండాలు ప్రమాదంలో ఉంటే కంటి చూపు అస్పష్టంగా కనిపిస్తుందంట. ఎందుకంటే? అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు ఉన్నవారిలో అవి వారి కంటిలోని రక్తనాళాలను కూడా ప్రభావితం చేయడం వలన దృష్టిలో మార్పు వస్తుంది. ఇది మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపిస్తుందంట.


**కళ్లు పొడిబారడం :** కళ్లు పొడిబారడం కొన్ని సమయంలో సహజం. కానీ తరచుగా కళ్లు పొడిబారడం, కంటిలో దురద వంటి సమస్యలు తలెత్తే జాగ్రత్తపడాలని చెప్తున్నారు వైద్యనిపుణులు. ఎందుకంటే మూత్రపిండాల సమస్యతో బాధపడే వారిలో కూడా ఈ సమస్య ఉంటుందంట.

**కళ్లు ఎక్కువగా ఎరుపు రంగులోకి మారడం :** కళ్లకు ఏదైనా గాయం అయినప్పుడు లేదా, దుమ్ము ధూళి పడినప్పుడు మాత్రమే కళ్లు ఎరుపు రంగులోకి మారుతాయి. కానీ మీ కళ్లు ఎప్పుడూ ఎరుపు రంగులో ఉంటే మాత్రం తప్పకుండా ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలంట. కళ్లు ఎరుపు రంగులోకి మారడం మూత్రపిండాల వ్యాధికి ప్రధాన కారణం అంటున్నారు నిపుణులు. కిడ్నీ సమస్య ఉన్నవారు రంగులను చూడటంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. మూత్రపిండాల సమస్యలు ఉన్న కొంతమందికి కొన్ని రంగులను, ముఖ్యంగా నీలం , పసుపు రంగులను వేరు చేయడం కష్టంగా అనిపించవచ్చు. ఇది ఆప్టిక్ నరాల దెబ్బతినడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా రెటీనాలో మార్పుల వల్ల వస్తుందంట. కిడ్నీ సమస్య ఉన్నవారు రంగులను చూడటంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. మూత్రపిండాల సమస్యలు ఉన్న కొంతమందికి కొన్ని రంగులను, ముఖ్యంగా నీలం , పసుపు రంగులను వేరు చేయడం కష్టంగా అనిపించవచ్చు. ఇది ఆప్టిక్ నరాల దెబ్బతినడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా రెటీనాలో మార్పుల వల్ల వస్తుందంట.

# రోజూ గుడ్డు తినొచ్చా - అందులోని కొలెస్ట్రాల్ మంచిదేనా

### రోజూ గుడ్డు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భయాలు

### పరిశోధనలు ఏం చెప్తున్నాయో తెలుసా?



'సండే అయినా, మండే అయినా రోజూ తినండి గుడ్డు' అని అడ్వర్టైజ్మెంట్‌లో వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం గుడ్డులోని పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుందని కొంతమంది తినడం మానేస్తున్నారు. ఇంకొందరు గుడ్డులోని తెల్లసొన తిని, పచ్చసొనను పక్కన పెడుతుంటారు. వాస్తవానికి, వీటి రెండింటిలోనూ పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుడ్డులోని పచ్చసోన తినడం ఆరోగ్యానికి మంచిదా? కదా? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!ప్రపంచవ్యాప్తంగా గుడ్లు అత్యంత సంపూర్ణమైన, చౌకైన ఆహార వనరులు. తెల్లసొనలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని మన అందరికీ తెలుసు. కానీ, గుడ్డులోని ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పచ్చసొనలోనే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిని తీసివేస్తే, గుడ్డులోని పోషక విలువలు గణనీయంగా తగ్గిపోతాయంటున్నారు. ఈ క్రమంలో గుడ్డును 'సూపర్ ఫుడ్'గా మార్చే పోషకాలన్నీ పచ్చసొనలోనే ఉన్నాయని పేర్కొంటున్నారు.

**విటమిన్లు, ఖనిజాలు :** గుడ్డు పచ్చసొనలో విటమిన్ ఎ, డి, ఈ, కె వంటి కొవ్వులో కరిగే విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యానికి, శరీరానికి రక్షణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయంటున్నారు నిపుణులు. వీటితో పాటు విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ పుష్కలంగా ఉంటుందని, ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు.


**గుండె ఆరోగ్యానికి :** గుడ్డును రోజూ తినడం వల్ల గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉందని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూ ఒకటి లేదా రెండు గుడ్లు తినడం వల్ల గుండె జబ్బుల ముప్పు పెరగదని, పరిమితంగా తిన్నప్పుడు ఇవి శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను అందిస్తాయంటున్నారు నిపుణులు. గుండెజబ్బులతో బాధపడుతున్న వారు రోజుకు 200ఎగ్ర కంటే తక్కువగా కొలెస్ట్రాల్ తీసుకోవడం మంచిది.

**మెదడు పనితీరుకు మేలు :** పచ్చసొనలో 'కోలిన్' అనే కీలక పోషకం ఉంటుందట. ఇది మెదడు పనితీరుకు, నరాల ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి చాలా అవసరమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా గర్భిణులకు ఇది మరీ అవసరమట. ఎందుకంటే, ఇది పిండం మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని చెబుతున్నారు. మనం తినే ఆహారం వల్ల కొలెస్ట్రాల్ రాదని పేర్కొంది. ఈ క్రమంలో కళ్లకు మేలు చేసే ల్యూటిన్, జీక్సాంథిన్; మెదడు, నరాలకు మేలు చేసే కోలిన్; వివిధ విటమిన్లు లాంటి ఆరోగ్యకరమైన పోషకాలు కూడా ఉన్నాయని తెలిపింది.కంటి ఆరోగ్యానికి రక్షణ : పచ్చసొనలో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కళ్లను హానికరమైన బ్లూ లైట్ నుంచి కాపాడటమే కాకుండా, వయస్సుతో పాటు వచ్చే చూపు మందగించడం, శుక్లాల సమస్యలను నివారిస్తాయంటున్నారు నిపుణులు.


**పోషకాల శోషణ :** పచ్చసొనలోని కొవ్వులు శరీరానికి అవసరమైన విటమిన్లను గ్రహించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించి, అనవసరమైన స్నాక్స్ తినకుండా చేస్తుందని అంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల ఎటువంటి నష్టం ఉండదని సూచిస్తున్నారు.

**కండరాల పెరుగుదల :** కేవలం తెల్లసొన కంటే, గుడ్డు మొత్తాన్ని తిన్నప్పుడే శరీరానికి ప్రోటీన్ సమర్థవంతంగా అందుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కండరాల మరమ్మత్తు, పెరుగుదల కోసం అథ్లెట్లకు ఇది ఎంతో మేలు చేస్తుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో పచ్చసొనను వదిలేసి, కేవలం తెల్లసొనను తినడం వల్ల శరీరానికి అందాల్సిన ముఖ్యమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, మెదడుకు మేలు చేసే పోషకాలను కోల్పోయినట్లేనని నిపుణులు తెలియజేస్తున్నారు. అయితే, డాక్టర్లు వద్దని చెబితే తప్ప, ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా గుడ్డును పూర్తిగా తినడం మంచిదని సూచిస్తున్నారు.

# ప్రపంచంలో రాత్రి లేని దేశం ఒకటి ఉందని మీకు తెలుసా? ఆ దేశ అందాలు చూడానికి రెండు కళ్ళు చాలవు సుమా..



పగలు రాత్రి కలిస్తే రోజు. ప్రపంచంలోని ప్రతి దేశంలో సూర్యోదయం, సూర్యాస్తమం జరుగుతోంది. ప్రజలు రోజులో పగలు తమ పనులు విధులను నిర్వహించి.. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. అయితే ప్రపంచంలో రాత్రి లేని ఒకటి ఉందని మీకు తెలుసా.. ఆ దేశంలో సూర్యుడు కేవలం 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ దేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు ఏమిటంటే.. పగలు రాత్రి కలిస్తే రోజు. ప్రపంచంలోని ప్రతి దేశంలో సూర్యోదయం, సూర్యాస్తమం జరుగుతోంది. ప్రజలు రోజులో పగలు తమ పనులు విధులను నిర్వహించి.. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. అయితే ప్రపంచంలో రాత్రి లేని ఒకటి ఉందని మీకు తెలుసా.. ఆ దేశంలో సూర్యుడు కేవలం 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ దేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు ఏమిటంటే.. ప్రపంచంలో చాలా ప్రదేశాలు రహస్యాలతో నిండి ఉన్నాయి. వాటి గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ప్రపంచంలో వాటి ప్రత్యేకతలకు ప్రసిద్ధి చెందిన అనేక దేశాలు కూడా ఉన్నాయి. వాటిని చూడటానికి , వాటి గురించి తెలుసుకోవడానికి ప్రజలు దూర ప్రాంతాల నుంచి వస్తారు. రాత్రి లేని దేశం ఉందని మీకు తెలుసా. ప్రజలు సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపే ఇతర దేశాలలో ఒకటి నార్వే. ఈ దేశంలో రాత్రి ఉండదు. ఇక్కడ సూర్యుడు 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ ప్రదేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను ఈ రోజు తెలుసుకుందాం. 40 నిమిషాలు మాత్రమే అస్తమించే సూర్యుడు నార్వే యూరోపియన్ ఖండానికి ఉత్తరాన ఉంది. ఇది ఉత్తర ధ్రువానికి చాలా దగ్గరగా ఉంది. ఈ కారణంగా ఇక్కడ చాలా చల్లగా ఉంటుంది. ఈ దేశంలో సూర్యుడు 76 రోజులు అస్తమించడు. దాదాపు రెండున్నర నెలలు, ఇక్కడ రాత్రి 40 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఇక్కడ సూర్యుడు అర్ధరాత్రి 12:40 నుంచి 1:30 గంటల మధ్య దాదాపు 40 నిమిషాలు అస్తమిస్తాడు. అందుకే నార్వేని అర్ధరాత్రి సూర్యుని భూమి అని పిలుస్తారు అని పిలుస్తారు. ప్రజలు పండుగ జరుపుకుంటారు నార్వే ప్రజలు మిడ్‌నైట్ సన్‌ను పండుగగా జరుపుకుంటారు. అర్ధరాత్రి బీచ్‌ను సందర్శించడానికి దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తారు. ఇది మాత్రమే కాదు.. ఇక్కడి ప్రజలు అర్ధరాత్రి సూర్యుడిని చూడటానికి ట్రెక్కింగ్‌కు కూడా వెళతారు. ఈ సమయం ఆ దేశ ప్రజలకు చాలా ప్రత్యేకమైనది. అందమైన దృశ్యాలు నార్వే దేశంలో అందాలకు కొదవ లేదు. ఇక్కడి అందం ఎంతగా ఉంటుందంటే.. అర్ధరాత్రి బోటింగ్, ట్రెక్కింగ్ చేస్తూ ప్రజలు ఇక్కడ తిరుగుతారు. చాలా దూరం నుంచి వచ్చే పర్యాటకులు ప్రతి సంవత్సరం ప్రజలు నార్వేజియన్ నగరమైన ట్రోమ్సోకు ఉత్తర దీపాలను చూడటానికి వస్తారు. దీనిని అరోరా బోరియాలిస్ అని కూడా పిలుస్తారు. ఈ దీపాలను చూడటానికి ఉత్తమ సమయం నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య ఉంటుంది. ఎందుకంటే ఈ సమయంలో రాత్రులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో సూర్యుడు అస్తమించడు. ఇక్కడ దాదాపు 24 గంటలూ సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు.



# ఆన్‌లైన్ పేమెంట్స్ చేసే వారికి అలర్ట్

**మోసాలకు చెక్ పెడుతూ మరింత సురక్షితంగా డిజిటల్ పేమెంట్స్**


**ఓటీపీలకు ప్రత్యామ్నాయంగా ఆన్‌లైన్ కార్డ్ చెల్లింపుల వ్యవస్థ**

**పేమెంట్ పాస్‌కీ సేవల్ని లాంచ్ చేసిన వీసా**

ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో వచ్చే ఓటీపీలను దొంగిలించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్న వేళ, ప్రముఖ గ్లోబల్ పేమెంట్స్ సంస్థ వీసా కీలక నిర్ణయం తీసుకుంది. ఓటీపీలపైనే పూర్తిగా ఆధారపడటాన్ని తగ్గిస్తూ, వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్), ఫేస్ ఐడీ లేదా మొబైల్ పిన్‌తోనే చెల్లింపుల్ని ధ్రువీకరించే పేమెంట్ పాస్‌కీ సేవల్ని భారత్‌లో ప్రారంభించింది. దీంతో ఓటీపీ ఫిషింగ్ వంటి సైబర్ మోసాల్ని తగ్గించడంతో పాటు డిజిటల్ చెల్లింపుల్ని మరింత సురక్షితంగా మార్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంకా భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను మెరుగుపర్చేందుకు ఈ సేవలు తెచ్చినట్లు పేర్కొంది. ఒకవైపు కృత్రిమ మేధ ఆధారిత వాణిజ్యం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కేవలం పాస్‌వర్డ్‌లు, లేదా వన్ టైమ్ పాస్‌వర్డ్‌లపై (ఓటీపీ) ఆధారపడే ధ్రువీకరణ విధానం ఇకపై సరిపోదని వీసా స్పష్టం చేసింది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వీసా ఇండియా అండ్ దక్షిణాసియా గ్రూప్ కంట్రీ మేనేజర్ సురేష్ సేథీ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపుల భద్రత కొత్త దశలోకి అడుగుపెడుతుందన్నారు. 'పాత తరహా పాస్‌వర్డ్స్, ఓటీపీలపై ఆధారపడే వ్యవస్థ నుంచి బయటకు రావాల్సిన సమయం వచ్చింది. భద్రత అనేది టెక్నాలజీ డిజైన్‌లోనే అంతర్భాగంగా మారిపోవాలి. అంటే వినియోగదారులకు కనిపించకుండా, సహజంగానే పనిచేసే, మోసాలను తట్టుకునే భద్రతా వ్యవస్థ అవసరం' అని ఆయన తెలిపారు.

**అసలు ఈ పేమెంట్ పాస్‌కీ ఎలా పనిచేస్తుంది**

వీసా తీసుకొచ్చిన పేమెంట్ పాస్‌కీ ద్వారా వినియోగదారులు డిజిటల్ కార్డ్ చెల్లింపుల సమయంలో ఓటీపీ కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. వారి మొబైల్ ఫోన్‌లో ఇప్పటికే ఉన్న సెక్యూరిటీ ఫీచర్లయిన వేలిముద్ర, ఫేస్ రికగ్నిషన్, డివైజ్ పిన్ లేదా ప్యాటర్న్ ఉపయోగించి ఆన్‌లైన్ కార్డు చెల్లింపుల్ని ధ్రువీకరించవచ్చు. ఈ విధానం భారత్‌లో అమల్లో ఉన్న టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ నిబంధనలకు పూర్తిగా అనుగుణంగానే ఉంటుందని వీసా స్పష్టం చేసింది.




**విశ్వసనీయతే ఇప్పుడు కీలకం**

సురేష్ సేథీ ప్రకారం- పేమెంట్ పాస్‌కీ అనేది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రమాణాల ఆధారంగా రూపొందించారు. దీంతో ఓటీపీ ఫిషింగ్, నకిలీ లింకులు, ఫేక్ వెరిఫికేషన్ వంటి సైబర్ మోసాల నుంచి వినియోగదారులకు మరింత మెరుగైన రక్షణ లభిస్తుంది. మొబైల్ ఫోన్‌లో ఇప్పటికే ఉన్న భద్రతా వ్యవస్థలనే ఉపయోగించడం వల్ల చెల్లింపులు మరింత వేగంగా, సులభంగా పూర్తవుతాయని ఆయన వివరించారు. భారత్‌లో డిజిటల్ పేమెంట్స్ వేగంగా విస్తరిస్తున్నాయని, ఇప్పుడు ఈ రంగం మూడో దశలోకి ప్రవేశించిందని సేథీ పేర్కొన్నారు. మూడో దశలో విశ్వసనీయత లేదా నమ్మకం (ట్రస్ట్) అనేది అత్యంత కీలక అంశంగా మారిందన్నారు. భద్రత, విశ్వసనీయత పెరిగితేనే డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని చెప్పారు.

**భవిష్యత్తు వాణిజ్యాన్నే మార్చేస్తున్న ఏఐ**

ఇక భారత్ ప్రస్తుతం ఆన్‌లైన్ కార్డ్ పేమెంట్స్‌లో ప్రపంచంలోనే అత్యధిక టోకనైజేషన్ (సున్నితమైన సమాచారాన్ని డిజిటల్ కోడ్‌గా మార్చే భద్రతా ప్రక్రియ) కలిగిన దేశంగా నిలిచిందని వీసా వెల్లడించింది. దేశంలో ప్రస్తుతం 90 కోట్లకుపైగా పేమెంట్ టోకెన్లు వినియోగంలో ఉండగా, వాటిల్లో దాదాపు 50 కోట్ల వీసా టోకెన్లు ఉన్నాయని సేథీ తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమలు చేసిన టోకనైజేషన్, డిజిటల్ చెల్లింపుల భద్రతా నిబంధనల వల్లే ఈ పురోగతి సాధ్యమైందని చెప్పారు. ఏఐ భవిష్యత్తు వాణిజ్యాన్ని పూర్తిగా మార్చేస్తోందని సేథీ చెప్పుకొచ్చారు. వినియోగదారులు ఏదైనా ప్రొడక్ట్‌ను వెతకడం, పోల్చడం, కొనుగోలు చేయడంలో ఇక ఏఐ ఆధారిత అసిస్టెంట్స్ కీలక పాత్ర పోషిస్తారని, స్మార్ట్ డివైజ్‌లు కూడా భవిష్యత్తుల్లో లావాదేవీల్లో భాగమవుతాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లోనే మరింత భద్రమైన, వేగవంతమైన ధ్రువీకరణ విధానాలు అవసరం అవుతాయని ఆయన వివరించారు. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని సురేష్ సేథీ అభిప్రాయపడ్డారు. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆర్బీఐ, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, వ్యాపార సంస్థలు, టెక్నాలజీ కంపెనీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేటప్పుడు నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు రాకపోవడం లేదా పొరపాటున ఓటీపీలను ఇతరులకు చెప్పి మోసపోవడం వంటి సమస్యలకు వీసా తెచ్చిన పేమెంట్ పాస్‌కీ పరిష్కారం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# "3 ఇన్ 1 అకౌంట్, గ్రీన్ స్కోర్, ఇ-ట్రేడ్"

**యోనోలో కొత్త సదుపాయాలు!**

**71వ వార్షికోత్సవ వేళ కీలక ప్రకటన చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**కస్టమర్లకు అత్యాధునిక బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా కొత్త సేవలు ప్రకటన!**

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. 53 కోట్ల మంది వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేసింది. బ్యాంకింగ్ సేవల కోసం విస్తృతంగా ఉపయోగిస్తోన్న యోనో యాప్‌లో పలు మార్పులు చేసింది. ఈ క్రమంలోనే ఈ యాప్‌కు కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ ఆవిష్కరణలు, కొత్త సేవలను యాడ్ చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ 71వ వార్షికోత్సవ వేళ కీలక ప్రకటన చేసింది. తమ కస్టమర్లకు అత్యాధునిక బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ సేవలు తీసుకొచ్చినట్లు ఎస్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. యోనో ప్లాట్‌ఫామ్ వేదికగా ఖాతాదారుల బ్యాంకింగ్ లావాదేవీలను మరింత సులభతరం చేసేందుకు, వ్యాపారాలను బలోపేతం చేసేందుకు, ఆర్థిక, పర్యావరణ శ్రేయస్సుకు ఇవి ఉపకరిస్తాయని పేర్కొంది. ఈ క్రమంలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోనో ప్లాట్‌ఫామ్‌పై 3-ఇన్-వన్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ సదుపాయం తీసుకొచ్చింది. దీని ద్వారా కొత్త కస్టమర్లు సేవింగ్స్ అకౌంట్స్‌తో పాటు ఎస్‌బీఐ క్యాప్ సెక్యూరిటీస్ ద్వారా డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలను డిజిటల్‌గా ఓపెన్ చేయవచ్చు. అంటే పెట్టుబడుల కోసం వేర్వేరు ఖాతాల కోస దరఖాస్తు చేసే అవసరం లేకుండా ఈ యాప్ ద్వారా ఒకే ఒక్క ప్రక్రియ ద్వారా ఈ మూడింటినీ ఈజీగా ఓపెన్ చేయవచ్చు. ఇక ఉద్యోగుల కోసం కూడా ఎస్‌బీఐ ఓ సదుపాయం తీసుకొచ్చింది. బ్రాంచ్‌కు వెళ్లే అవసరం లేకుండాసేవింగ్స్ అకౌంట్‌ను కార్పొరేట్ శాలరీ అకౌంట్‌గా మార్చుకోవచ్చు. అలాగే శాలరీ అకౌంట్‌ను ఆన్‌లైన్‌లోనే అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. అలాగే కస్టమర్ల కోసం "ఫైనాన్షియల్ ఫిట్‌నెస్ స్కోర్" అనే మరో సదుపాయాన్ని ఎస్‌బీఐ తీసుకొచ్చింది. ఇది కస్టమర్ల డిపాజిట్లు, లోన్లు, ఇన్సూరెన్స్, పెట్టుబడులు, ఖర్చులు, పొదుపు అలవాట్లను విశ్లేషించి యాప్‌లోనే స్మార్ట్ బడ్జెట్ రికమండేషన్స్ ఇస్తుంది. పర్యావరణ శ్రేయస్సు కోసం: బ్యాంకింగ్ రంగంలో తొలిసారిగా పర్యావరణ అనుకూల విధానాన్ని యోనో యాప్‌లో ప్రవేశపెట్టింది ఎస్‌బీఐ. దీని ద్వారా కస్టమర్లు తమ డిజిటల్ లావాదేవీలు చేయడం ద్వారా ఎంత కర్బన ఉద్గారాలను ఆదా చేశారో ట్రాక్ చేయవచ్చు. ఇక ప్రతి నెలా కస్టమర్ల డిజిటల్ వాడకాన్ని బట్టి గ్రీన్ స్కోరు కేటాయిస్తారు. దీనిని కూడా ఈజీగా చెక్ చేసుకోవచ్చు. యోనో బిజినెస్‌లో ఇ-ట్రేడ్ సేవలను ఎస్‌బీఐ విస్తరించింది. దీని ద్వారా కార్పొరేట్, మీవీజు వినియోగదారులు ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, ఇన్‌లాండ్ ట్రేడ్ ఫైనాన్స్ ట్రాన్సాక్షన్స్‌ను ఎక్కడి నుంచైనా పర్యవేక్షించవచ్చు. బిజినెస్ కస్టమర్ల కోసం యోనో జీ పేరుతో ఏఐ వర్చువల్ అసిస్టెంట్‌ను ఎస్‌బీఐ ప్రారంభించింది. కస్టమర్ల సందేహాలను నివృత్తి చేయడానికి, బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయడానికి, ఉత్పత్తులు, ప్లాట్‌ఫామ్ ఫీచర్లు, సేవలను సంబంధించిన సేవల కోసం తక్షణ గైడెన్స్ కోసం ఈ ఏఐ అసిస్టెంట్ అందుబాటులోకి వచ్చింది. ఇక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, కస్టమర్ సెంట్రిక్ బ్యాంక్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా ఈ సదుపాయాలు తీసుకొచ్చినట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు.




# బంగారం ఎక్కువగా వాడే దేశాల్లో భారత్ రెండో స్థానం

**అదనంగా 2,000కిలోల వెలికితీతకు ప్లాన్- పసిడి దిగుమతులు తగ్గుతాయా**

**భారత్‌లోనే మొట్టమొదటి ప్రైవేట్ బంగారు గనిగా నిలిచిన జొన్నగిరి ప్రాజెక్ట్**

**ఏటా 2టన్నుల పసిడి ఉత్పత్తి**

**ఫారిన్ నుంచి దేశానికి పసిడి దిగుమతులు తగ్గుతాయా**

దేశంలోని ఖనిజ నిల్వలను వినియోగించుకోవడం ద్వారా బంగారం ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామంలో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ బంగారు గని కార్యకలాపాలను ప్రారంభించింది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులో భారీ పెట్టుబడిని పెట్టాయి. మొదటి దశలో జొన్నగిరి గని ఏటా 400 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా కార్యరూపం దాల్చిన తర్వాత ఈ బంగారు గని నుంచి ఏటా 2,000 కిలోల వరకు పసిడిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త గని దేశ బంగారు దిగుమతులను ఎంతమేర తగ్గిస్తుంది ఎంత విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తుంది తెలుసుకుందాం పదండి. జొన్నగిరి బంగారు గని ప్రారంభంతో దేశంలో ఉత్పత్తిలో ఉన్న గోల్డ్ మైన్స్ సంఖ్య నాలుగుకి చేరింది. 2023--24 సంవత్సరంలో దేశ పసిడి ఉత్పత్తి 1,552 కిలోలు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే సుమారు 8.3శాతం ఎక్కువ. కర్ణాటక అత్యధిక బంగారాన్ని ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచింది (మొత్తం ఉత్పత్తిలో 93శాతానికి పైగా వాటా). మిగిలిన ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగింది. గనుల మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025--26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో మొత్తం 1,845.53 కిలోల బంగారం ఉత్పత్తి అయ్యింది. అందులో కర్ణాటకకు చెందిన హట్టి గోల్డ్ మైన్స్ కో లిమిటెడ్ నుంచే 1,692.36 కిలోలు ఉత్పత్తి జరిగింది. ఏపీ నుంచి 132.83 కిలోలు, ఝార్ఖండ్ నుంచి 20.34 కిలోల పసిడి ఉత్పత్తి అయ్యింది. స్వర్ణగిరి ప్రాజెక్ట్ (గతంలో జొన్నగిరి ప్రాజెక్ట్ అని పిలిచేవారు) అంటే దేశ స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ప్రారంభించిన మొట్టమొదటి భారీ స్థాయి ప్రైవేట్ బంగారు గని వెలికితీత ప్రాజెక్ట్. ఏపీలోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో ఉన్న ఈ బంగారు ఉత్పత్తి ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ కోసం రూ.405 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఈ గని ద్వారా జియో మైసూర్ సంస్థ ఏటా 2 టన్నుల (2,000 కిలోలు) బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి ఏడాది 400కిలోలు, ఆ తర్వాతి ఏడాది 900 కిలోలు, ఆ తర్వాత నుంచి ఏటా 2 టన్నుల మేర పసిడి ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు వేస్తోంది. స్వర్ణగిరి ప్రాజెక్ట్ 700 మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పిస్తుందని అంచనా. ఇందులో 80శాతం ఉద్యోగాలు స్థానికులకే లభించనున్నాయి. అదనంగా వెలికితీసిన బంగారం విలువపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 4శాతం రాయల్టీ లభిస్తుంది. దీనివల్ల రాష్ట్రానికి ఏటా రూ.57 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. కర్నూలు జిల్లాలోని జొన్నగిరి, ఎర్రగుడి, పాగిడిరాయి అనే మూడు గ్రామాలలో సుమారు 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో జొన్నగిరి ప్రాజెక్ట్ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో బంగారు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. దేశ పసిడి ఉత్పత్తిలో జొన్నగిరి ప్రాజెక్ట్ వాటా ప్రస్తుతం తక్కువగానే ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ తన ప్రారంభ దశలో (2026--27) సుమారు 400 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. అలా ఉత్పత్తి అంతకంతకు పెరగనుంది. స్వర్ణగిరి ప్రాజెక్ట్ భవిష్యత్తులో సుమారు 2 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. 2025--26లో దేశం సుమారు 72 బిలియన్ డాలర్ల విలువైన 722 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఈ నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై స్వర్ణగిరి ప్రాజెక్ట్ ప్రభావం చాలా స్వల్పంగా ఉంటుందని అర్థమవుతోంది. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. అయితే దేశీయ ఉత్పత్తి వార్షిక అవసరాల్లో 0.5శాతం కంటే తక్కువగానే ఉంటోంది. దీంతో దేశం దాదాపు పూర్తిగా పసిడి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గణాంకాల ప్రకారం, భారత్‌లో బంగారం కోసం వార్షిక డిమాండ్ సాధారణంగా 700- 800 మెట్రిక్ టన్నుల (మీ) మధ్య ఉంటుంది. ఈ డిమాండ్ ప్రధానంగా ఆభరణాల వినియోగం, వివాహాలు, పండుగలు, పెట్టుబడి మార్గాల (బంగారు కబడ్డీలు, నాణేలు వంటివి) ద్వారా ఏర్పడుతుంది. దేశీయ మైనింగ్ ద్వారా వార్షిక అవసరాలలో 0.5శాతం కంటే తక్కువ పసిడే సమకూరుతోంది. గనుల మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, భారత్‌లో దేశీయ పసిడి ఉత్పత్తి ఏటా సుమారు 1.2-1.8 మెట్రిక్ టన్నుల మధ్య నమోదవుతోంది. దీనికి భిన్నంగా డిమాండ్ మాత్రం 700-800 మెట్రిక్ టన్నుల వరకు ఉంటోంది. ఫలితంగా పసిడిని భారీగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, పసిడి ధరలు పెరిగినప్పటికీ 2025--26లో భారత్ భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు 24 శాతం పెరిగి, 71.98 బిలియన్ అమెరికన్ డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. స్టాటిస్టా వెబ్‌సైట్ ప్రకారం, 2024లో భారతదేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద బంగారు దిగుమతిదారుగా, ఆసియా దేశాల్లో 3వ స్థానంలో ఉంది. భారతదేశం 51.8 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ప్రపంచ బంగారు దిగుమతుల్లో 9శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ (ఐటీసీ) ప్రకారం, 2024లో అంతర్జాతీయ బంగారు మార్కెట్‌లో దిగుమతి వాటా పరంగా భారతదేశం కంటే ముందున్న ఇతర ప్రధాన దిగుమతిదారుల్లో స్విట్జర్లాండ్ (18.3%), చైనా (17.9%), యూకే (13.4%), మరియు హాంగ్ కాంగ్ (11.4%) ఉన్నాయి.



# పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఉన్నా రికార్డు స్థాయిలో భారత్ చమురు దిగుమతులు

**జూన్ నెలలో రికార్డు స్థాయిలో ముడిచమురు దిగుమతులు చేసుకున్న భారత్**

**ఎలా సాధ్యమైందంటే**




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారత్ జూన్ నెలలో రికార్డు స్థాయిలో ముడిచమురు దిగుమతులు చేసుకుంది. కేవలం ఆ ఒక్క నెలలోనే భారత్ రోజుకు 4.93 మిలియన్ బ్యారెళ్ల (ఎజూ౦) ముడిచమురును దిగుమతి చేసుకుందని ఎనర్జీ ఇంటెలిజెన్ సంస్థ 'కెప్లర్' పేర్కొంది. భారత్ ఈ స్థాయిలో చమురు దిగుమతి చేసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కెప్లర్ సంస్థకు చెందిన విశ్లేషకుడు సుమిత్ రిటోలియా తెలిపిన వివరాల ప్రకారం, ఈ జూన్ నెలలో రష్యా నుంచి భారత్ చేసుకునే ముడిచమురు దిగుమతులు రోజుకు 2.6 మిలియన్ బ్యారెళ్లకు పెరిగాయి. దీనితో భారత్‌కు అత్యంత పెద్ద చమురు సరఫరాదారుగా రష్యా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. జూన్ నెలలో భారత్ దిగుమతి చేసుకున్న మొత్తం చమురులో రష్యా వాటా సగానికిపైగా ఉండడం గమనార్హం. వాస్తవానికి మే నెలలో రష్యా నుంచి భారత్ రోజుకు 2.13 మిలియన్ బ్యారళ్లు దిగుమతి చేసుకుంది. ఆ నెలలో భారత్ చేసుకున్న మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 36.5 శాతంగా ఉంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత యూరోపియన్ దేశాలు రష్యా చమురుపై ఆంక్షలు విధించాయి. దీనితో రష్యా తన ముడిచమురును భారీ రాయితీతో విక్రయించేందుకు సిద్ధమైంది. దీనిని అవకాశంగా చేసుకొని, రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లను భారీగా పెంచింది. దీనితో 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి రష్యానే భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. పశ్చిమాసియా ఘర్షణల కారణంగా, హర్మూజ్ జలసంధిలో చమురు నౌకల రవాణాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీనితో చమురు ధరలు అమాంతం పెరిగిపోయాయి. అయినప్పటికీ భారత్ వివిధ దేశాల నుంచి చమురును సేకరిస్తూ, దేశీయ అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చూసుకుంది. "గడచిన 100 రోజులుగా భారత ముడిచమురు దిగుమతులు ఎలాంటి అంతరాయం లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచంలోని ప్రధాన చమురు దిగుమతి దేశాల్లో భారత్ ప్రస్తుతం అత్యంత సురక్షితమైన స్థితిలో ఉంది. ముందస్తు ప్రణాళికలతో, వైవిధ్యమైన కొనుగోలు వ్యూహాలతో చమురు సరఫరా తగ్గకుండా భారత్ చూసుకోగలిగింది" అని కెప్లర్ అనలిస్టు సుమిత్ రిటోలియా పేర్కొన్నారు. "సాధారణంగా ముడిచమురు కార్గోలను ఒకటి నుంచి రెండు నెలల ముందే బుక్ చేసుకుంటారు. ఈ పద్ధతిలోనే భారత్‌కు చెందిన చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) ఆగస్టు మొదటి వారం వరకు కావాల్సిన చమురును దిగుమతి చేసుకున్నాయి. అందువల్ల భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినప్పటికీ, ప్రస్తుతానికి అదనపు కొనుగోళ్లు జరపాల్సిన అవసరం లేకుండా పోయింది. వైవిధ్యమైన వనరుల నుంచి చమురును సేకరించడం, రిఫైనరీ ఆర్థక వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడంలో భారత చమురు సంస్థలు సాధించిన విజయానికి ఈ రికార్డు స్థాయి దిగుమతులే నిదర్శనం" అని సుమిత్ రిటోలియా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచ ముడిచమురు సరఫరా తగినంతగా అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆఫ్రికా, రష్యా, వెనెజువెలా దేశాల నుంచి దిగుమతులు పెరగడం, ఒపెక్ ప్లస్ దేశాల ఉత్పత్తి పెరగడం, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా నిరంతరాయంగా కొనసాగుతుండడమే ఇందుకు కారణం. అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత ముడిచమురు ధరలు తగ్గాయి. కనుక సమీప భవిష్యత్తులో ఈ చమురు సరఫరాకు ఎలాంటి ముప్పు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఇక సమీప భవిష్యత్తులో ఇరాన్ నుంచి భారతదేశానికి ముడిచమురు దిగుమతులు చెప్పుకోదగ్గ స్థాయిలో పునఃప్రారంభం అయ్యే అవకాశం ఉందని సుమిత్ రిటోలియా తెలిపారు. జులై లేదా ఆగస్టు నెలల్లో ఒకటి లేదా రెండు కార్గోలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆగస్టు ప్రారంభం వరకు ఇండియన్ రిఫైనరీలకు కావాల్సిన ముడిచమురు ఇప్పటికే సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. అయితే ఇరాన్ నుంచి చమురు దిగుమతి అనేది, ఆగస్టు 21 తర్వాత ఆంక్షల కొనసాగింపు లేదా సడలింపుపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ముడిచమురు దిగుమతిదారు, వినియోగదారు అయిన భారత్, తన చమురు అవసరాల్లో 88 శాతం కంటే ఎక్కువ ఇంపోర్ట్స్ ద్వారానే తీర్చుకుంటోంది. ముఖ్యంగా 2022 నుంచి రాయితీ ధరకు లభిస్తున్న రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలు చేస్తోంది.

# శతాబ్దాల కంపెనీ సంచలనం.. స్టాక్ మార్కెట్లోకి పార్లే-జీ

**రూ.లక్ష కోట్ల విలువతో భారీ ఐపీఓ!**

**భారీ ఐపీఓకు సిద్ధమవుతున్న పార్లే ప్రొడక్ట్స్**

**రూ.లక్ష కోట్లకు పైగా వ్యాల్యుయేషన్‌తో మార్కెట్లోకి**

**రూ.9,500 కోట్లకు పైగా నిధులు సమీకరించే యోచన**

**దాదాపు వందేళ్ల తర్వాత పబ్లిక్‌గా మారనున్న కంపెనీ**





భారతీయులందరికీ సుపరిచితమైన పార్లే-జీ బిస్కెట్ల తయారీ సంస్థ, పార్లే ప్రొడక్ట్స్ లిమిటెడ్ త్వరలో స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది భారీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) తీసుకురావాలని కంపెనీ ప్రణాళికలు రచిస్తోంది. ఈ ఐపీఓ ద్వారా 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9,530 కోట్లు) నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఐపీఓ సమయంలో కంపెనీ వ్యాల్యుయేషన్‌ను 10.5 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా) పైగా అంచనా వేస్తున్నారు. దాదాపు వందేళ్లుగా ప్రైవేట్ సంస్థగా కొనసాగుతున్న పార్లే ప్రొడక్ట్స్ పబ్లిక్ ఇష్యూకు రానుండటం భారత కార్పొరేట్ రంగంలో ఒక ముఖ్యమైన పరిణామం. ఈ ఐపీఓ ప్రక్రియను నిర్వహించేందుకు కంపెనీ ఇప్పటికే కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్‌లను సలహాదారులుగా నియమించుకున్నట్టు తెలుస్తోంది. త్వరలో మరో బ్యాంకును కూడా చేర్చుకునే అవకాశాలున్నాయి. అయితే, ఈ ప్రణాళికలన్నీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, మార్కెట్ పరిస్థితులను బట్టి తుది నిర్ణయాలు ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. 1929లో ముంబైలోని విలే పార్లేలో ప్రారంభమైన ఈ సంస్థను చౌహాన్ కుటుంబం ప్రమోట్ చేస్తోంది. పార్లే-జీ, క్రాక్‌జాక్, మొనాకో, హైడ్ అండ్ సీక్ వంటి ఐకానిక్ బిస్కెట్లతో పాటు మ్యాంగో బైట్, మెలోడీ, పాపిన్స్ వంటి మిఠాయిలతో ఈ బ్రాండ్ దేశ ప్రజలకు దగ్గరైంది. అమెరికా, యూకే, కెనడా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలతో పాటు పలు దేశాల్లో పార్లే ఉత్పత్తులకు బలమైన మార్కెట్ ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం 8.5% వృద్ధితో రూ.15,568 కోట్లకు చేరింది. అయితే, నికర లాభాలు మాత్రం 39% తగ్గి రూ.979 కోట్లుగా నమోదయ్యాయి. ఐపీఓ ఊహాగానాలపై స్పందించిన కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మయాంక్ షా, మార్కెట్ స్పెక్యులేషన్‌పై తాము వ్యాఖ్యానించబోమని, ప్రస్తుతం వ్యాపార వృద్ధిపైనే దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. ఒకవేళ ఈ ఐపీఓ ప్రణాళిక ప్రకారమే జరిగితే, ఇది భారత ఎఫ్‌ఎంసీజీ రంగంలోని అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలిచిపోతుంది. ఇదిలా ఉండగా, చౌహాన్ కుటుంబంలో చీలిక తర్వాత ఏర్పడిన 'పార్లే ఆగ్రో' (ఫ్రూటీ, యాపీ ఫిజ్ బ్రాండ్లు)కు, ఈ పార్లే ప్రొడక్ట్స్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని గమనించాలి.



## 'జన నాయకుడు' రిలీజ్‌కు లైన్ క్లియర్...

## విజయ్ చివరి సినిమా సెన్సార్ పూర్తి చేసుకుందా?

కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జోసెఫ్ విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు') మరోసారి వార్తల్లో నిలిచింది. రాజకీయాల్లో పూర్తిస్థాయిలో అడుగుపెట్టే ముందు విజయ్ నటించిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సెన్సార్‌కు సంబంధించిన సమస్యల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతుండగా, ఇప్పుడు ఆ అడ్డంకులు తొలగిపోయాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందించారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయాలని నిర్మాతలు ముందుగానే ప్రకటించారు. గతంలో ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో ఎదురైన ఇబ్బందులతో ఆ ప్రణాళిక వాయిదా పడింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, గతేడాది డిసెంబర్‌లో చిత్రాన్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ పరిశీలనకు పంపారు. అయితే సినిమాలోని కొన్ని రాజకీయ అంశాలు, సంభాషణలపై సెన్సార్ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. అనంతరం కొన్ని న్యాయపరమైన అంశాలు కూడా తెరపైకి రావడంతో సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొంది.దాదాపు ఏడు నెలల తర్వాత ఇప్పుడు సెన్సార్ సమస్యలు పరిష్కార దశకు చేరుకున్నాయని కోలీవుడ్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఇటీవల సోషల్ మీడియాలో 'జన నాయగన్' చిత్రానికి జదీఖీజ 'ఖా' సర్టిఫికేట్ జారీ చేసిందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నారని పోస్టులు వైరల్ అవుతున్నాయి. మరోవైపు, ఇంకా సెన్సార్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో క్లియరెన్స్ వచ్చే అవకాశముందని మరికొందరు పేర్కొంటున్నారు. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం లేదా జదీఖీజ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల 'ఖా' సర్టిఫికేట్ మంజూరైందనే విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేం. రాజకీయాల్లోకి వెళ్లే ముందు విజయ్ నటించిన చివరి సినిమా కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి భారీ స్థాయిలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.సినిమా విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకసారి విడుదల తేదీ ప్రకటిస్తే, విజయ్ సినీ ప్రయాణానికి ముగింపు పలికే ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసేందుకు అభిమానులు సిద్ధమవుతున్నారు.




## 'లెనిన్' అంటే కమ్యూనిజం కాదు.. టైటిల్ వెనుక ఉన్న అసలు కథ వెల్లడించిన అఖిల్!

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' చిత్రం జూలై 10న అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పటి నుంచి ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తితో పాటు పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. 'లెనిన్' అనే పేరు వినగానే ఇది రాజకీయ నేపథ్యమున్న సినిమానో లేదా కమ్యూనిజం సిద్ధాంతాల గురించిన కథో అయి ఉంటుందని సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగింది. అయితే తాజాగా ఈ టైటిల్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని హీరో అఖిల్ స్వయంగా వెల్లడించి అందరి అనుమానాలకు పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్‌కు ఎలాంటి పొలిటికల్ కనెక్టివిటీ లేదని, ఇది పూర్తిగా ఒక కల్పిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రమని అఖిల్ స్పష్టం చేశారు. దర్శకుడు నందు గారి స్వగ్రామమైన రాయలసీమ ప్రాంతానికి తాను వెళ్ళినప్పుడు అక్కడ 'లెనిన్ బాబు' అనే ఒక వ్యక్తిని కలిశానని, ఆ ప్రాంతంలో కమ్యూనిస్ట్ మూలాలు లేదా ఆ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన కుటుంబాలు తమ పిల్లలకు లెనిన్, స్టాలిన్ వంటి పేర్లు పెట్టుకోవడం చాలా సాధారణమని ఆయన వివరించారు. అలా రాయలసీమలో ఇది చాలా కామన్ పేరుగా మారిపోయిందని అఖిల్ పేర్కొన్నారు. దర్శకుడు నందుకు ఈ పేరు పట్ల ఉన్న ప్రత్యేక ఇష్టం, గౌరవంతోనే ఈ టైటిల్‌ను ఎంచుకున్నట్లు అఖిల్ తెలిపారు. కథ ప్రకారం సమాజంలో ఒక బలమైన శక్తిగా ఎదిగి, సహజ సిద్ధమైన నాయకత్వ లక్షణాలతో ప్రజలను నడిపించే ఒక పవర్‌ఫుల్ కుర్రాడి పాత్రకు ఈ పేరు సరిపోతుందని భావించి 'లెనిన్' అని ఫిక్స్ చేశారు. ఈ పేరు కేవలం కమ్యూనిజానికి మాత్రమే కాకుండా ఒక అద్భుతమైన లీడర్‌షిప్‌కు ప్రతీకగా నిలుస్తుందని చిత్ర బృందం నమ్ముతోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ యాక్షన్ లవ్ డ్రామాగా రూపొందింది. అఖిల్ తన కెరీర్‌లోనే అత్యంత మాస్ లుక్‌లో, పక్కా సీమ యాసతో అలరించనున్నారు. మురళి కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త కథాంశంతో, అఖిల్ సరికొత్త మేకోవర్‌తో రాబోతున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జూలై 10న థియేటర్లలో సందడి చేయడానికి సర్వం సిద్ధమైంది.





## దసరా బరిలో మెగాస్టార్.. 'విశ్వంభర' విడుదల తేదీ ఖరారు!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా 2026, అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ది వెయిట్ ఈజ్ ఓవర్! మెగాస్టార్ చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.


## 'నాగబంధం' రిలీజ్‌కు ముందు బంపర్ ఆఫర్.. ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు కొత్త ప్లాన్!

పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' (దీూ+ూ) ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ముఖ్యంగా సినిమాలో ఉపయోగించిన ఎఖీశ, ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌తో పాటు సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. రిలీజ్‌కు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న 'నాగబంధం'కు దీూ+ూ ఆఫర్ ఎంతవరకు ఉపయోగపడుతుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో ఈ వ్యూహం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో ఎంత మేర సక్సెస్ అవుతుందో చూడాలి.




## కౌంట్‌డౌన్ మొదలు.. 'ది ఒడిస్సీ' నుంచి కొత్త ట్రైలర్ విడుదల!

ప్రపంచవ్యాప్తంగా సినిమా లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' నుంచి సరికొత్త 'కౌంట్‌డౌన్ ట్రైలర్' విడుదలైంది. యూనివర్సల్ పిక్చర్స్ రిలీజ్ చేసిన ఈ ఫైనల్ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా అమాంతం పెంచేసినట్లు తెలుస్తుంది. గ్రీక్ పురాణాల నేపథ్యంలో ఒక అద్భుతమైన యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుండగా.. ట్రోజన్ యుద్ధం తర్వాత ఇథాకా రాజు 'ఒడిస్సియస్' తన సొంత రాజ్యానికి, భార్య వద్దకు తిరిగి రావడానికి చేసిన 10 సంవత్సరాల సుదీర్ఘమైన, ప్రమాదకరమైన ప్రయాణమే ఈ సినిమా కథాంశం. ఈ చిత్రంలో ఒడిస్సియస్‌గా హాలీవుడ్ స్టార్ నటుడు మాట్ డామన్ నటిస్తుండగా, అతని భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో సముద్రపు తుఫానులు, యుద్ధ సన్నివేశాలు, భయంకరమైన సైక్లోప్స్ (భారీ ఆకారంలో ఉండే రాక్షసులు) సైరెన్స్ ఎదుర్కొనే దృశ్యాలను గ్రాండ్‌గా చూపించారు. ఈ చిత్రంలో టామ్ హాలండ్, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండయా, లుపితా న్యాంగో, షార్లిజ్ థెరాన్ వంటి స్టార్ నటులు నటిస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం జులై 17న గ్రాండ్‌గా విడుదల కానుంది.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.